# రాగబంధం

లోకం నిద్ర నుండి లేచింది. అన్నపూర్ణమ్మగారి శరణాశ్రమం ప్రశాంతంగా వుంది. అంత వరకూ రెక్కల క్రింద వెచ్చగా పడుకున్న పిల్లలు - తల్లి పక్షులు గూడు వదిలి యివతలకు వస్తూవుంటే కిల కిలా అరవడం మొదలెడుతున్నాయి...

ఆశ్రమంలో తల్లుల ప్రక్కలోని పిల్లలు లేచి ఆటలాడుకుంటున్నారు, వేకువ జామున వీచే చల్లని గాలి చెట్ల కొమ్మల మీద నుండి వీస్తూ గలగలమని శబ్దం చేస్తూంది. సూర్య భగవానుడు బంగారు రంగులు వేయబోయే ముందు - తెల్ల రంగువేసి సిద్ధం చేసిన కేన్వాస్ లా వుంది ఆకాశం.

దూరంగా ఆశ్రమం లోంచి చంటి పిల్లాడి ఏడుపు వినిపిస్తూంది. పాపను సముదాయించలేక కమల సతమత మవుతూంది. బాబుని ఒడిలో పెట్టుగుని - బుజ్జగిస్తూ

'' ఊరుకో బాబూ వూరుకో ! నేనెంత దురదృష్టవంతురాలిని - యిహ నీ ముద్దు మొహం చూసే భాగ్యం లేదు కదా ! నా కడుపున ఎందుకు పుట్టావు ! నేను తల్లిని కాదు రాక్షసిని ! నీవు పెద్ద వాడవయి నీ తల్లి ఎవరంటే ఏమని చెబుతావు ? నన్ను తిట్టుగుంటావా ? కాని నేనేం చెయ్యను ?... పాపాత్మురాలిని ! నీ ఆట పాటలు చూసుకుని మురిసి పోయే యోగం నాకు లేదు ! ఎందుకలా చూస్తావు? ఎందుకలా నవ్వుతావు ?...

నాకు హృదయం లేదు - జాలి లేదు - దయ లేదు - నా గుండె రాయి ! నిన్ను వదిలి వెళ్లిపోతున్నానా ?... నా బాబూ ! ... ( ఏడుస్తూ) అబ్బ ! నేనెందుకింకా బ్రతికి ? కన్న కొడుకుని కనిపారేసిన దౌర్భాగ్యురాలిని ! నేను తల్లినా ? ... నా వేపలా జాలిగా చూడకురా బాబూ ! ... నువ్వు పెద్దవాడివవుతావు- చదువుకుంటావు ! ఉద్యోగం చేస్తావు ! పెళ్లి చేసుగుంటావు! ... అవన్నీ చూసే అదృష్టం నాకు లేదు... నేను వున్నా నిన్ను దిక్కులేనివాడివనే అంటారు... ఎలా సహించేది ? ఏం చేసేది ? నిన్ను వదిలి వెళ్లక తీరదు. తండ్రీ .... నన్ను మరిచిపో !....

అని ఏడుస్తూ తన స్థితికి తనే నిందించుకుంటూ కుమిలి పోతున్నది.

అప్పటి కప్పుడే బాగా తెల్ల వారింది ; చీకటిపోయి వెలుగు వచ్చినా కమల హృదయంలో వెలుగుపోయి చీకటి ఆక్రమించింది.

ఆ సమయంలో అన్నపూర్ణగారూ, ఆయా సత్యవతి అక్కడకు వచ్చారు.

''కమలా నువ్వు యివాళ యింటికి వెళ్లిపోవచ్చునమ్మా !'' అని అన్నది.

''అన్నపూర్ణమ్మగారూ ... నేను వెళ్లనండీ... యీ పాపను వదిలి వెళ్లలేనండి '' అని వెక్కి వెక్కి

ఏడుస్తూ అంది కమల.

''పిచ్చిపిల్లా! తల్లి ప్రేమ అట్లానే అనిపిస్తూంది. నీ బాబుకేం భయంలేదు. మా కన్నబిడ్డలా చూసుకుంటాం... నిశ్చింతగా వెళ్లమ్మా!'' అని ధైర్యం చెప్పింది అన్నపూర్ణ.

''ఏమండీ నాకు జీవితంలో మరే ఆనందమూ అక్కరలేదు. నాకు మరి ఏ కోర్కెలూ లేవు, యీ సంసారజీవితమూ, ఆపేక్ష అంతకన్నా లేదు. యిక్కడే మీతో పాటు నన్నూ ఉండనీయండి... యీ పిల్లలనూ, నా బాబునూ కూడా, పెంచుకుంటూ బ్రతుకుతాను... యీ మాత్రం ఉపకారం చేయండి, మీ మేలు యీ జన్మలో మరువలేను... కాదనకండి అన్నపూర్ణమ్మగారూ!'' అని ప్రాధేయపడింది.

''నువ్వింకా చిన్నదానవు కమలా! నీకింకా అనుభవంలేదు... ప్రపంచం, మనుష్యులూ అంటే ఏమిటో తెలియదు, యీ పసికందును వెనక వేసుకొని, నీ జీవితాన్ని ఎటర్పణ చేస్తున్నావు, ఏదో చిన్నతనం చేత, అమాయకంగా యిలా అంటున్నావు. కాని అటువంటి పొరపాట్లు మళ్లీ జరగకుండా చూసుకోవడమే నీ కర్తవ్యం, యీ బాబుని మరిచిపో! యిది నీ మంచి కోసమే! ఇప్పుడీ ఉద్రేకంలో అలాగనిపించినా, జీవితాంతమూ ఒంటరిగా, ఏకాంతంగా, మోడులా, బ్రతుకు గడపడం, అనుకున్నంత సులువు కాదు. నువ్వు జీవితంలో గ్రహించినదనా ఎంత? అనుభవించవలసిన కాలం ముందే వున్నది. అధైర్యపడకు!''

''అనుభవించినది చాలదా?''

''వెర్రి తల్లీ! అలా కృంగిపోకూడదు... నీకేం! కడుపులో పెట్టుకు కాపాడే తల్లిదండ్రులున్నారు.... అటు చూడు... ఏ దిక్కూలేక, నా అన్నవాళ్ళ వల్ల నిరాకరింపబడి అనాధలయిన వాళ్లు ఏ మొండి ధైర్యంతో బ్రతుకుతున్నారు? ఏం చూసుకుని బ్రతుకుతున్నారు?.... జరిగినది మరిచిపో! ఎంత బంగారపు పళ్లేనికయినా గోడ చేర్పు తప్పదు! నీ బాబుకి యిక్కడే లోపం రానివ్వం... వెళ్లి నీ భావి జీవితం, ఆలోచించుకో, అందరూ ఆశించే ఆనందాన్ని, తిరిగి నీ జీవితంలో పొందడానికి ప్రయత్నించు''

''అంతేనా మీ సలహా అన్నపూర్ణమ్మగారూ!'' అని నిరాశతో అన్నది కమల.

ఇంతలో టాక్సీ మీద కమల తల్లీ తండ్రీ వచ్చారు. కమల తండ్రి టాక్సీలోనే వుండి, భార్యను పంపాడు. తల్లిని చూడగానే కమల ఆపుగోలేని దుఃఖంతో సిగ్గుతో, తలవంచుకు ఏడవ జొచ్చింది.

''రా తల్లీ పోదాం!'' అని అన్నది తల్లి..

బిక్క మొహంతో కమల చూస్తూవుంటే, అన్నపూర్ణమ్మ గారి సంజ్ఞతో, సత్యవతి కమల చేతిలోని పిల్లడిని తీసుకుంది. తల్లికి దూరమవుతున్నానని తెలిసినట్టుగా గట్టిగా ఏడవడం మొదలెట్టేడు, ఆశ్రమం అంతా దద్దరిల్లిపోయినట్టు ఏడుస్తున్నాడు... ఆ ఏడ్పుకు అందరి హృదయాలూ ద్రవించిపోయినాయి.

కమల ఏం చేసేదీ లేక... ''నేనేం చేసేది తండ్రీ!'' అని నోట్లో కొంగు పెట్టుగొని కుమిలి పోసాగింది. మరోసారి పిల్లడిని ఒడిలోకి తీసుకొని, తనివి తీరా హృదయానికి హత్తుకొని

ముద్దుల ఊపేగింది.

సత్యవతి తిరిగి బిడ్డని తీసుకుని అక్కడ నుండి వెళ్ళిపోయింది - కమల వదలలేక వదలలేక ఆ ఆశ్రమం వదిలి యివతలకు వచ్చేసింది. టాక్సీలో తండ్రిని చూసి, తలవంచుకొని కూర్చుంది.

ఇంటి దగ్గర దిగగానే ఎవరు పలకరిస్తారో అన్న భయంతో బితుగు బితుగు మంటూనే వుంది. అనుకున్నట్టుగానే, కమలతో చదువుకున్న సావిత్రి ఎదురుగా వచ్చి పలకరించింది.

''హల్లో! కమలా వచ్చేసావా? నీ మేనమామగారింట్లో జబ్బు పడ్డావని విన్నాను. నయంగా వుందా!'' అని అడిగింది.

ఆ మాటలు విని మొదట్లో ఆశ్చర్యపోయింది కమల కాని అసలు నిజం లోకానికి తెలియనివ్వకుండా యీ విధంగా తన తల్లిదండ్రులు అందరికీ చెప్పి వుంటారని గ్రహించి, ఆ ఆశ్చర్యాన్ని కనబడనివ్వకుండా.

''అవును సావిత్రీ యిప్పుడు వొంట్లో బాగానే వుంది. మరి అక్కడ ఎందుకని వచ్చేశాను'' అని అంది నిర్లిప్తంగా.

''బాగా నీరసించి పోయావు సుమీ! నువ్వు మీ మావయ్యగారింటికి వెళ్ళిపోయావు! యీ సెలవుల్లో నాకేమీ ఊసుపోలేదంటే నమ్ము! ఎప్పుడొస్తావా అని చూస్తున్నాను! తర్వాత మా యింటి కొస్తావు కదూ!'' అని అడిగింది -

''అలాగే వస్తాను సావిత్రీ'' అని పరధ్యాన్నంగా జవాబిచ్చింది కమల.

స్నేహితురాలి మొహం చూడ్డానికే సిగ్గుపడిపోయింది; సావిత్రి వెళ్ళిపోయిది. ఆ తర్వాత యిరుగు పొరుగు వాళ్ళు కూడా పలకరించారు - తల్లిదండ్రులు, పడిన జాగ్రత్త వలన జరిగిన సంగతి ఎవరికీ తెలియలేదు - అంత విచారంలోనూ ''అదృష్టం బావుండబట్టి'' అని అనుకున్నారు తల్లిదండ్రులు. కమలకు మాత్రం అప్పట్లో పొంగివచ్చే దుఃఖం తప్ప మరే భావాలూ కలుగలేదు. ఆమెలో ఒక నిరాశ, బ్రతుకు మీద అసహ్యం, జీవితం మీద విరక్తి కలిగింది; ఒకప్పుడు ఎంతో, ఉల్సాహంగా, చలాకీగా వున్న కమల, మౌన ముద్ర వహించింది, ఎవరితోనూ అట్టే మాటాడ్డం మానుకుంది. ఆమెలో సంతోషం అన్నది లేకండాపోయింది, ముఖాన్న నవ్వు రావడమే అపురూప మయిపోయింది ఏదో తినీ తిననట్టు, ఎంగిలి పడడం, ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ పరధ్యాన్నంగా వుండడం మొదలెట్టింది.

ఆమెను చూసి తల్లీ దండ్రీ బెంగ పడజొచ్చారు! అన్యాయకంగా పొరపాటు చేసిన కూతుర్ని చూస్తే వారికి కోపం పోయి, జాలి కలుగజొచ్చింది. తండ్రికి మాత్రం కోపం రగులుతున్నా, ఎటువంటి ఏమొస్తుందో అని దిగమింగి వూరుకున్నాడు. అందుకు కారణం కమల తల్లి. ఆయన నోటి నుండి ఏమీ రాకండా, సమాధాన పర్చింది. మీదు మిక్కిలి కూతుర్ని మామ్మూలు మనిషిగా, చేయడానికి, ఉల్సాహ పరచడానికి, జీవితం మీద కోరిక కలిగించడానికి శాయశక్తులా ప్రయత్నించేది.

రాను రానూ తగిలిన గాయం మాన జొచ్చింది. కమల స్నేహితురాళ్ళతో కలిసి తిరుగుతూ జరిగిన విషయం మరచిపో జొచ్చింది.

కమల తల్లి మాత్రం, యిక వూరుకోలేదు. కమలకు తెలియకుండా తన ప్రయత్నాలు తను

చేస్తూనే వుంది. భర్తతో కమల వివాహ విషయం కదుపుతూనే వున్నది.

"ఏమండీ మళ్లీ పెళ్లి అడిగారా ?... ఏమన్నాడు ? ఎన్నాళ్లిలా పిల్లని యింట్లో వుంచుగుంటాం?" అని సాధ్యమయినంత మట్టుగు, కమల ప్రేమించిన వాడితోనే సంబంధం చేద్దామని ప్రయత్నించింది. భర్తని అతని దగ్గరకు మళ్లీ మళ్లీ వెళ్లి అడగమన్నది.

"పిచ్చిదానా ? ఎందుకొప్పుగుంటాడు ? తన అవసరం తీరాకా ?" అని భర్త తిరిగి వచ్చేక అనగానే ఆమె బాధపడింది.

"జరిగిందేదో జరిగినా ఆ భగవంతుని దయవల్ల, మన మర్యాద నిలబడింది, పోనీ యిప్పటికయినా ఒప్పుకుంటాడేమో - యింత వరకూ పచ్చాకసాంప్రదాయాలు పట్టుగు కూర్చుంటే ఎలా ? పైనచ్చే కట్నమేదో వాళ్లికే యిచ్చేద్దాం అనుకుంటే యిలా అయింది" అని నిట్టూర్చింది.

"ఆపాటి నాకు తెలియదనుకున్నావా ? అన్ని విధాలా అడిగి చూశాను. అంత సత్యవంతులే యీ లోకంలో వుంటే యికనేం కావాలి ? .... లోకం సంగతి తెలియక అమాయకంగా నమ్మి మోసపోయింది పిచ్చి తల్లి ! మన కర్మం మనం అనుభవించక తప్పదు. ససేమిరా నాకేమీ తెలియదని కొట్టి పారేస్తున్నాడు... దీనికి ఋజువేమిటి ! బయట పెట్టుగుంటే మన పరువే పోతుంది ! యింక చెయ్యగలిగిందేమిటి? అందికే నోరు మూసుగు వూరుకోవడం మంచిదనిపిస్తూంది !" అని అన్నాడు.

"అలాగని ఎన్నాళ్లు పెళ్లి కాకుండా వుంచేస్తాం ! ఎదిగిన పిల్లని ! ఆ సంబంధం కాకపోతే, మరో సంబంధం చూసి వేగిరం నిశ్చయించండి ! .... ఆ మూడుముళ్లూ పడిపోతే యింక ఏ బెంగ వుండదు.... యిప్పటికిగుట్టుగా నలుగురి నోట్లోనూ పడకుండా గడిచిపోయింది. ఆలశ్యం చేస్తే ఎటొంచి ఏమొస్తుందో?"

"అదే నేనూ అనుకుంటున్నాను... మొన్నను ఒక సంబంధం చూశాను. రేపో, యివాళో చూపులకి వస్తామన్నారు - దేవుడు మేలు చేస్తే యీ సంబంధమే నిశ్చయించి ముహూర్తం పెట్టిస్తాను."

ఇలా యిద్దరూ అనుకొని సంబంధాల కోసం ప్రయత్నించి, ఆఖరికి ఒక సంబంధం నిశ్చయించి, తాంబూలాలు పుచ్చుగున్నారు. ఒక శుభముహూర్తాన కమల పెళ్లి అతి వైభవంగా జరిగిపోయింది. కమల భర్తతో కాపురానికి వెళ్లిపోయింది. తల్లీ దండ్రీ బరువు దింపుగుని నిర్విచారంగా వున్నారు.

కమల భర్త ఆనందరావు ఎంతో ఉత్తముడు, సంస్కారి, విశాల హృదయుడు, ఆమెను ఎంతో ప్రేమగా, అభిమానంగా, చూసుకున్నాడు. అతని సహచర్యంలో కమల తనని తనే మరచిపోయింది. అంత ఉత్తముని భార్యగా అవడం తన అదృష్టమని భావించింది. తను ఏ జన్మలో చేసుకున్న పుణ్యఫలమో, యీ జీవితం యిదే విధంగా గడిచిపోయేట్టు చూడమని వేయి దేవుళ్ళకు మొక్కుకుంది.

ఏ ఒడుదొడుకులూ లేకుండా జీవితం గడిచిపోతున్నా కమలకు లోలోన, మనోవ్యధ తప్పలేదు! తను చేసిన పాపం, తనని లోలోన తినేస్తూంది. అంత వుత్తముడైన భర్తకు అమాయకుడైన భర్తకు, అన్యాయం చేస్తున్నట్టు, ఏమీ ఎరుగని దానివలె మోసం చేస్తున్నట్టులనిపించి కృంగిపోతూంది. తను

చేసిన తప్పు అతనితో చెప్పి క్షమించమని ప్రార్థిద్దామని, అందుకాయన క్షమించినా, శిక్షించినా, మనస్ఫూర్తిగా అనుభవించి, యీ మనోవ్యథనుండి విముక్తిని పొందుదామని అనుకుంటుంది. కాని నోటివరకూ వచ్చి మాటలు పెగలవు. అదో విధమయిన భయం, వణుకూ వచ్చి వూరుకుంటుంది. అతనికి తను తగదనిపిస్తుంది. ఈ విధమయిన మనో సంఘర్షణ వల్ల ఎప్పుడూ విచారంగా వున్నట్టు వుండేది. అది గ్రహించి ఆనందరావు ఒకనాడు

''కమలా మన వివాహం జరిగి ఏడాది కావస్తూంది! కాని, నువ్వెప్పుడూ ఏదో ఆలోచిస్తూ, పరధ్యాన్నంగా, విచారిస్తున్నట్టు వుంటావు... దీనికి కారణం ఎన్నిసార్లు అడిగినా చెప్పకుండా తప్పించుకుంటున్నావు... ఆఖరికి నీ ఆరోగ్యం కూడా చెడగొట్టుకుంటున్నావు - నీలో ఏదో బాధ వుంది, అది నాతో చెప్పకూడదా ? నే పైవాడినా ?'' అని అడిగాడు.

ఆ మాటలు విని ఉలికిపడింది కమల. ఆ సంభాషణ రాకుండా తప్పించుకుందామని తను ఎప్పుడూ జాగ్రత్తగా వుండేది, ఏమాటకామాట వస్తుందో అని ఆమె భయం.

''అబ్బే ఏం లేదండీ... నాకేమి ? నేనెందుకు బాధపడతాను ? ఊరికినే అలా అనిపిస్తున్నానేమో... నాకేం తక్కువ చేశారని విచారం ?'' అని మాటలు తప్పించింది.

''లేదు కమలా ! నా దగ్గర అబద్ధం ఆడుతున్నావు. అలా అద్దంలో చూసుకో. నువ్వు వచ్చినప్పటికీ, యిప్పటికీ ఎంత చిక్కిపోయినావో ! చెప్పకుండా మనోవ్యథ ఏదో నీలో వుంది... నాతో చెప్పు... మూడుపువ్వులూ, ఆరుకాయలుగా, హాయిగా సుఖంగా యిద్దరం ఆనందంగా జీవితం గడపవలసిన రోజుల్లో నీకెందుకా విచారం ? నువ్విలా లేనిసంతోషం తెచ్చుకుని - వుంటేనే సహించలేను- నిజం - కమలా చెప్పు నిన్ను క్రుంగదీస్తున్న విషయం ఏమిటో, సందేహించకు, నీకన్నా నాకెవరున్నారు? నువ్వేదంటే కాదనగలను ?'' అని తిరిగి అడిగేడు.

''బాగుందండీ ! నా మీద అభిమానం కొద్దీ అలా అంటున్నారు, నా మీద ప్రేమ వల్లనేను మీకంటికలా కనబడుతున్నాను... అంతేగాని.. మీరు నాకేం లోటు చేశారని, నాకు - విచారం, అలాంటి పిచ్చి ఆలోచనలు పెట్టుకోకండి, నేను బాగానే వున్నాను, నాకే విచారమూ లేదు. సరేనా ?'' అంది భర్తకు నమ్మకం కలిగించాలనే వుద్దేశ్యంతో.

''నువ్వెన్ని అను కమలా నేను నమ్మను. నువ్వు నా దగ్గర ఏదో దాస్తున్నావు, చెప్పు నువ్వేదంటే కాదన్నాను ? నీ సంతోషమే నా సంతోషం ! మనిద్దరం ఒకటయినపుడు నువ్విలా నిరుత్సాహంగా, అయిష్టంగా, సర్వసంగ పరిత్యాగిలా వుంటే నాకెలా వుంటుంది ? చెప్పు ! నువ్వే నా దగ్గర యిలా దాస్తావని అనుకోలేదు ! ఏదో పైకి చెప్పలేని ఆవేదన లోపల వుంచుగొని సుఖాన్ని చెడగొట్టుగోవడం ఎందుకు ? నీ మనసులో వున్నదేదో చెప్పరాదా ?'' అని అనునయిస్తూ అడిగేడు.

ఆ ముక్కలు విని కమల ఏనాటినుండో తనలో నున్న కోరికను బయట పెట్టకుండా వుండలేకపోయింది.

''మరేం లేదండి నా తోటి వాళ్ళను చూడండి ! పిల్లా పాపతో ఎంత ముచ్చటగా వున్నారో ! మీరు ఆఫీసుకు వెళ్ళిపోయాక నాకీ యింట్లో ఒంటరిగా తోచడం లేదండీ !'' అన్నది మెల్లగా.

యీ మాటలు విని అలా అంటుందని వూహించని ఆనందరావు ఒక్కసారిగా ఆశ్చర్యపోయాడు, పెద్ద నవ్వు నవ్వి

''బావుంది కమలా - బావుంది. యిదా నీ కోర్కె? యిదా నీ విచారానికి కారణం? నిజంగా అంటున్నావా? హాస్యానికంటున్నావా? లేకపోతే ఏమిటిది? మనకు పెళ్ళయి యింకా ఏడాది కాలేదు... అప్పుడే పిల్లలు పుట్టలేదని విచారమా? సరేలే రేపు బజారులో ఒక్కటి బొమ్మను కొని తెస్తాలే... ముచ్చట తీర్చుకుందువుగాని -'' అని వేళాకోళం చేశాడు. ఆమె మనస్ఫూర్తిగానే బాధతో, కోర్కెతోనే అలా అంటున్నదని తెలియక.

''ఎందుకలా నవ్వుతారు! యిలా వేళాకోళం చేస్తారనే నే చెప్పలేదు! నిజంగానే నాకు పిల్లలంటే యిష్టం, కావాలి. ... హాస్యం కాదు...'' అన్నది.

''నిజంగానా కమలా? ఏమంత తొందర? పిల్లలు పుట్టకుండా ఎన్నేళ్ళో అయిపోయినట్టు బాధపడతావేం? మనకి మరి పిల్లలు పుట్టరన్నట్టు యిదవుతావేం? యింకా చాలా కాలం వుంది - కొన్నాళ్ళు పోయినా, ఆనందంగా వుండకుండా యిప్పటినుంచీ ఎందుకా బెడద?''

''మీకలా అనిపిస్తుంది గాని - నా బాధ మీకేం తెలుసు! నాకలా అనిపించడంలేదు, నా హృదయం తపించిపోతూంది! నాకు పిల్లలు కావాలి! లేకపోతే నేనుండలేనేమో! ఏమండీ, నేను నిజంగానే చెబుతున్నాను. నాకో పాప కావాలి!'' అని వుద్రేకంతో అంది. అది విని వింతపోయాడు ఆనందరావు.

''ఇదేం కోర్కె? నీకెన్నాళ్ళు దాటేయి గనుక? అయినా అనుకున్నంత వెంటనే యీ కోర్కె తీరేది గనుకనా? మన చేతుల్లో వుందా? అడిగిన వెంటనే నీకో పాపని ఎక్కడ నుండి తెచ్చి యివ్వగలను? ఇప్పుడు నేనేం చేసేది! .... నిన్ను సంతోషపెట్టడం ఎలాగో నాకు తెలియలేదు.'' అని నిస్పృహతో అన్నాడు.

''ఏదో అనేసాను ఊరుకోండి, మీకు అనవసరంగా కష్టం కలిగిస్తున్నాను. నా పిచ్చి కోర్కెను విని మీకు కోపం రాలేదు కదా!'' అని అంది కమల తను ఆవేదనలో ఆవేశంలో కోరిన అసహజమయిన కోర్కెను తలచుకొని, అతని అవస్థ చూసి.

''లేదు కమలా! నీకన్నా నాకెవరున్నారు? నీ కోర్కె తీర్చడం కన్నా నాకింకేం కావాలి? కాని యీ కోర్కె మన యిష్టాయిష్టాలలో వుందా! అయినా యింత వేగిరం నీకా కోర్కె కలగడం నాకాశ్చర్యంగా వుంది!'' అన్నాడు మనసులో నున్న సందేహం తీర్చుకోలేక.

''మీరు తల్చుకుంటే, మీ కిష్టమయితే నా కోర్కె తీరకపోదు! ...'' అని కమల తిరిగి అనేసరికి ఆనందరావు మరీ ఆశ్చర్యపోయాడు.

''అదెలా?'' అని ప్రశ్నించాడు.

''ఎవరి పాపనయినా పెంచుకుంటే ఎలా వుంటుంది? - కాదనకండి మీరు లేనప్పుడు యీ ఇంట్లో నిశ్శబ్దం సహించలేకుండా వున్నాను. నాకేం తోచకుండా వుంది. అంచేత ఎవరి పాపాయినైనా పెంచుకుంటేనా కోరిక తీరదా?'' అని అడిగింది, భర్త ఏమంటాడో అన్న ఆతృతతో అతని మొహం

చూస్తూ.

ఆ సలహా విన్నాక ఆనందరావుకు ఏమనడానికీ తోచలేదు. అది అతనికి ఏ మాత్రం యిష్టం లేదు. ఎట్లాగయినా ఆ దృష్టి నుండి ఆమెను మరల్చాలని కొంచం కోపంగానే -

''ఏమన్నావు కమలా ! పెంపకం తెచ్చుకుందామా ? నీకేం పిచ్చి పట్టిందా ? సంసార జీవితంలో ఒక్క ఏడాదయినా దాటలేదు. నీకిలాటి అసహజమయిన కోరిక ఏమిటి ? ముందు సంగతి ఆలోచించే అంటున్నావా ? తర్వాత మనకు పిల్లలు కలిగితే ఏమవుతుంది ? యీ పెంపకం పిల్లాడి మీద యిప్పటి ప్రేమ వుంటుందా ! హాయిగా కడుపున కలిగిన పిల్లలతో ఆనందించకుండా పెంపుడు పిల్లలవల్ల ఏం ఆనంద మనుభవించగలవు ? యిది లోక విరుద్ధంగా లేదా ?'' అని అన్నాడు.

''ఎందుకానందించ లేమండీ ? లోకంలో నాకు పనిలేదు. అయినా ఎంతమంది పెంచుకున్న పిల్లలతో సుఖంగా లేరు ? ఒకవేళ మనకు పిల్లలు కలిగినా అందరినీ సమానంగా ప్రేమించగలను'' అన్నది.

''పిల్లలు పుట్టే యీడూ, వ్యవధీ దాటిపోయాక, మరి సంతానం కలగదని ఆశలు వదులుకున్న వాళ్లకూ, తగినంత కాలం వేచి చూసి, మరి పిల్లలు పుట్టరని నిర్ధారణ చేసుకున్న వాళ్లకూ పెంపకం తెచ్చుకోవడం తప్పదు. కాని మనకేం ? మనకింకా కావలసినంత భవిష్యత్తు వుంది, అప్పుడే పిల్లలు కలగరన్న మాట ఏమిటి ? జీవితంలో ఏ బెడదా లేకుండా చిలకా గోరింకల్లా భార్యా భర్తలు ఆనందాన్ని అనుభవించే రోజులు యివే - యిలాటి సమయంలో లేనిపోనివి కల్పించుకుని, బాధపడడం దేనికి ? యీ విషయంలో నువ్వేమనుకున్నా నాకు మాత్రం నచ్చలేదు సుమా ! '' అని కొంచం కఠినంగానే నచ్చచెప్ప చూశాడు.

అయినా కమల తన పట్టు వదలలేదు.

''మీరలా అనకండి, నాకు శాంతి లభించాలంటే - ఊఁ అనండి - లేకపోతే నాకీ విచారం తప్పదు... ఎందుకో ఎంత కట్టుకుందామన్నా నా మనసు మారడం లేదు... ఉన్నది ఉన్నట్టు మీరడిగేరు కాబట్టి చెప్పినందుకు క్షమించండి ! మీ మనసుకు వ్యతిరేకంగా నేమీ చేయలేను. నాలో నేనే ఎలాగో బాధపడతాను. యీ విషయంలో మీరేం విచారించకండి ! '' అని అనేసింది.

''ఈ మాత్రం దానికి నాకేమీ పట్టింపులేదు... నీ కోరిక వింతగా వుందని అన్నానంతే - కాని నన్నేం చేయమంటావు ? ఎవరి పిల్ల నెవరిస్తారు ?''

''మీరు సరే నంటే చాలు, మీరే శ్రమా పడనక్కర్లేదు. యీ వూళ్ళోనే ఒక ఆశ్రమం వుంది. నాతో చదువుకున్న ఒకామె దానికి అధికారి - ఆ ఆశ్రమంలో ఎంతో మంది అనాథ బాలలు వున్నారు, వారిలో ఎవరినయినా, బాగున్నవాడిని తెచ్చుకుందాం ! ఏమంటారు, కాదనరు కదూ ! '' అని జాలిగా అడిగింది.

ఈ మాట వినేసరికి ఆనందరావుకు నిజంగానే కోపం వచ్చింది. ఎందుకంటే దగ్గిర బంధువుల పిల్లడిని ఎవరినయినా పెంచుకుందామని అంటుందేమోనని భావించాడు, కాని ఆమె ఏ అనాథ బాలుడినో తెచ్చుకుందామనేసరికి అతనికి సహనం పోయింది.

''ఏమిటిది కమలా ? నీకు మతి పోయినట్టుంది ! తెలిసిన వారిని, బంధువలనీ అడిగి తెచ్చుగున్నామంటే అర్థముంది, అంతేగాని, నామగోత్రాలూ, కులం, తల్లీ దండ్రీ ఎవరూ తెలియని అనాథ బాలుడినా ? తెచ్చుకోవడం ? నీకు ఏమయింది ? లేకన్ను ఆడిద్దామని యిలా అంటున్నావా? నేను నమ్మలేకుండా వున్నాను. యిదే నిజమయితే నా కెంత మాత్రం యిష్టం లేదు. అలా ఎన్నటికీ జరగదు. నువ్వు తెలివిగా మాటాడ్డం లేదు'' అని గట్టిగా అన్నాడు.

''అనాథయితే ఏమండి? కొంచం శాంతంగా ఆలోచించండి ఉన్నవాళ్ల పిల్లలను పెంచుకుంటే ఏముంది. పాపం తల్లీ దండ్రీ లేని అనాథలను పెంచుగుంటే వారికొక ఆధారం కల్పించిన వాళ్లం అవుతాము, ఏనాటికి నిజం తెలిసినా వాళ్లకు మనమీద, ప్రేమ, గౌరవం, భక్తీ ఎక్కువే అవుతుంది గాని తగ్గదు. యింక బంధువుల పిల్లల్ని తెచ్చుగుంటే, నిజం ఎలాగూ తెలుస్తుంది. అప్పుడు వాళ్ల మనసు అటువైపు వుంటుంది గాని యిటువయిపు వుండదు. అదేగాని - అనాథలయితే వారు ఎంతో కృతజ్ఞతతో కన్నవారి కన్నా ఎక్కువ ప్రేమతో వుంటారు... అవునంటారా ?''

ఈ సమర్థన ఆనందరావుకి నిజమనే అనిపించింది - కమల కోసం పెంపకానికి ఒప్పుగున్నపుడు... ఎవరి పిల్లల నయితేనేం ? కమల చెప్పినది బావుంది. కాని తనకే మాత్రం యిష్టం లేదు; మరోసారి హెచ్చరించడానికి ప్రయత్నించాడు.

''క్షమించు కమలా నీ అభిప్రాయాలు నాకేమీ అర్థం కావడంలేదు. యీ విషయంలో నన్ను వేధించకు... నీకు లోకజ్ఞానం పోయినా, నాకు పోలేదు. మనం అదృష్టవంతులమే అయితే మనకే ఆ భగవంతుడు త్వరలోనే బిడ్డనిస్తాడు. నీ మనసు మార్చుకుందికి ప్రయత్నించు'' అని చెప్పి మరి ఆమె మాట వినకండా అక్కడనుండి వెళ్లిపోయేడు.

ఆ విధంగా భర్త వెళ్లిపోయాక కమల మనసంతా వికలమయిపోయింది. ఆవిధంగా తన కోర్కెనెందుకు బయట పెట్టేనా అని అనిపించింది. తన ఆవేదనలో ఆ కోర్కె ఎంతో సబవుగా కనబడినా, లోకానికెంత అసభ్యంగా అనిపిస్తుందో గ్రహించలేకపోయింది. ఎంత గొప్ప హృదయం గలవాడైనా ఆనందరావు కూడా మనిషేగా ... అనవసరంగా అతని మనసు నొప్పించినందుకు విచారించింది. గాని ఎంత నిలదొక్కుకుందామన్నా.... పూర్వ స్మృతులు జ్ఞప్తికి వచ్చి, పాత గాయం రేగింది. దుఃఖం వెల్లువలా పొంగివచ్చింది.

''అయ్యో నా బాబు... యిన్నాళ్ళూ ఓపిక పట్టాను... ఎలాగో యీ మిష కల్పించి అతనికి నచ్చ చెప్పి - మనసు మార్చి నిన్ను తెచ్చుకుందామనుకున్నాను - నా ఆశయిలాగయింది ! అతనేం చేస్తారు ?

యిలాటి విపరీతమయిన కోర్కెకు ఎవరు ఒప్పుగుంటారు ? నిజం చెప్పడానికి ధైర్యం చాలక, అతన్ని మోసం చేస్తున్నాను. ద్రోహం చేసి కూడా నిన్ను తెచ్చుకుందామని, నా స్వార్థం కోసం.... ప్రయత్నించాను. కాని తెచ్చుకోలేకపోయాను...నువ్వెలాగున్నవో ! ఎవరయినా తీసుకు వెళ్ళి పోయారా? రాజులాటి వాడివి. చూసిన వాళ్లు నిన్ను వదులుతారా? వద్దు..వద్దు... అలా జరగదు... నిన్నెవళ్లూ తీసుకు వెళ్లకూడదు. నేనేవస్తాను... ఎలాగయినా తీసుకు వస్తాను....యిలా నేనిక్కడ నువ్వు లేకుండా

వుండగలనా బాబూ!... అని ఏడుస్తూ వుండేది. ఆనందరావు వచ్చినపుడు మాత్రం ఆ బాధ కనబడ నివ్వకుండా వుండడానికి ప్రయత్నించేది. కాని లోలోన, అదే ఆలోచనతో, మనోవ్యాధి పెట్టుగొని రాను రానూ ఆరోగ్యం పాడుచేసుకుంది.

ఆఖరికి ఆ మనో విచారం తోనే జ్వరం పెట్టుగుని మంచం పట్టింది.

ఒకనాడు ఆ జ్వర తీవ్రతలో ''బాబూ... ! బాబూ ! నా తండ్రి......వస్తున్నా... బాబూ'' అంటూ పలవరించింది.

ఆ మాటలు ఆనందరావు విన్నాడు. యింకా కమల ఆ వుద్దేశ్యం విడిచిపెట్టనందుకు ఆశ్చర్యపోతూ ''కమలా ! కమలా ! ఏమిటలా పలవరిస్తున్నావు.. ఏదీ యిలా చూడు ! యీపాటి దానికి యింత మనోవ్యాధి పెట్టుగోవాలా ? ఎంతలా మారిపోయావు ? ఏదో, మాటవరసకలా అన్నావనుకున్నాను. అదే మరచిపోతావనుకున్నాను - గాని యిలా బెంగ పెట్టుగొని శరీరానికి తెచ్చుగుంటావనుకోలేదు... పిచ్చిదానా! మరోసారి నాతో గట్టిగా చెప్పలేకపోయావా ? అలా లోలోనే బాధ పడి ఆరోగ్యం పాడుచేసుకుంటారా ? యింకా ఆపిల్లల మీదే ఆలోచనా ?'' అని అన్నాడు.

కమల తెలివి తెచ్చుగొని నిద్రలో అలా అనేసినందుకు సిగ్గుపడుతూ. ''ఏమన్నారు పలవరించానా?.. ఏమిటో తెలివి లేని జ్వరంలో ఏదో అనేసి వుంటాను. దాని గురించేం పట్టించుకోకండి!... నాకే ఆలోచనలు లేవు మీరు నిశ్చింతగా వుండండి'' అని సర్దుకొనబోయింది. కాని ఆనందరావు ఆమె అలా పైకి అంటున్నా లోలోన యీ అస్వస్థతకి ఆమె మనోవ్యాధే అని గ్రహించేడు.

''లేదు కమలా నేనిప్పుడు గ్రహించేను. నీ జ్వరానికి కారణం, ఇంత స్వల్పానికి వంటికి తెచ్చుగుంటావనుకోలేదు, ఎందుకలా బాధపడుతూ వుంటావు ? నువ్విలా కృశించి పోతూవుంటే నాకు మాత్రం ఏం సంతోషం ? నీ యీ స్థితికి ఆ కోర్కే కారణం అయితే, అలాగే ఆ ఆశ్రమానికి వెళ్ళి ఎవరినయినా తీసుకువస్తాను - యిహనయినా ఆ విచారం మనసులో పెట్టుగోక నిశ్చింతగా వుండు సరేనా?'' అని అన్నాడు. కమలను మనిషి లోకంలోకి తీసుకురావాలంటే మరో దారి లేక. ఆ చల్లని మాటలు విని కమల సంతోషించింది. ఎక్కడలేని ఆనందమూ ఆమెలో కలిగింది. ముఖంలో చీకట్లు పోయి ఒక కొత్త ఆశతో కూడిన కాంతి వచ్చింది.

గుండెల్లో బరువు ఒక్కసారి దింపుకున్నట్టు నిట్టూర్పు విడిచింది- తృప్తిగా నవ్వుతూ.

''నిజంగా మీరు ఒప్పుగున్నారా ? .... చాలు... యింక నాకేం బాధ వుండదు ! మీరు వెళ్ళి నపుడు చెప్పండి.... నేనూవస్తాను.. యిద్దరమూ కలిసే వెళదాం, మీకు తెలీదు నా కిష్టమయినపాపాయిని నేనే ఎంచుకు తెచ్చుగుంటాను !'' అని అంది ఎంతో కుతూహలంతో.

''ఇంత జ్వరంతో వస్తావా ? డాక్టరు విశ్రాంతి తీసుకోమన్నాడు - అలసట వస్తే యింకా ఎక్కువ వుతుంది జ్వరం !'' అని అన్నాడు.

''నా జ్వరానికి కారణం మీకు తెలిసింది కదా, యింక పరవాలేదు. అక్కడికి వెళ్ళేటప్పటికి తగ్గిపోతుంది లెండి !'' అని అంది పట్టరాని ఆనందంలో.

''సరే నీ యిష్టం..'' అని వూరుకున్నాడు.

''మీరెంత మంచివారండి... నాకోసం, మీకిష్టం లేకపోయినా ఒప్పుకున్నారు! నాకు తెలుసు మీది నిజమయిన ప్రేమ... నాది స్వార్థం... స్వార్థం కోసం... మీ మనసు - నొప్పించి నప్పించాను..... నా కోసం ఎంత త్యాగం - చేస్తున్నారు... '' అని అంటూ అంత నీరసంలోనూ లేచి భర్త చేతులు పట్టుకుంది.

ఆనందరావు ఆనంద భాష్పాలు రాలుస్తూ...

''నీ కోసం కాదు కమలా! నాకోసం! నువ్వు నాకు కావాలి!'' అని పడుక్కోబెట్టేడు.

ఆ రాత్రంతా కమలకు ఆనందంతో నిద్ర పట్టలేదు - బాబుని తలచుకొని వాడిని తెచ్చుకున్నాక కలిగే ఆనందం, యివన్నీ ఆలోచించుకుంటూ గడిపివేసింది. ఎంతవేగిరం తెల్లవారుతుందా అన్నపూర్ణ ఆశ్రమానికిపోయి బాబుని చూద్దామా అన్న ఆత్రుత లావయింది. కోర్కె నెరవేరుతుందనే నమ్మకంతో మనిషి ఎంతో ఉత్సాహంగా వుంది.

ఉదయం లేచేసరికి కమలకు, నీరసంటి, జ్వరం అంతా ఎక్కడికిపోయిందో చేత్తో తీసివేసినట్టు తేలికగా అయింది. లేచిన దగ్గర్నుండి ఆశ్రమానికి వెళ్ళే ప్రయత్నం చేయసాగింది. భర్తను పదే పదే తొందర పెట్టసాగింది.

ఇదంతా చూసి ఆనందరావుకి ఏమీ పాలుపోలేదు. భార్య ప్రవర్తన అసహజంగా వున్నా అదంతా ఆమెలో కల్గిన పిల్లల మీద కోర్కె వలనే అని భావించి వూరుకున్నాడు.

ఇద్దరూ కలిసి అన్నపూర్ణ ఆశ్రమానికి బయలు దేరారు ఆశ్రమానికి వెళ్ళి, కమల అన్నపూర్ణమ్మను కలిసేవరకూ, బాబు ఎలావున్నాడో ? ఆమె ఏమంటుందో అన్న ఆత్రుత లావయింది. ఎంతో ఉత్కంఠతతో ఆశ్రమం ప్రవేశించి అన్నపూర్ణమ్మను కలిసారు.

అన్నపూర్ణ మొదట కమలను పోల్చుగోలేదు.

''నమస్కారమండీ అన్నపూర్ణమ్మగారూ!'' అని అంది కమల.

''నమస్కారమండీ అలా కూర్చోండి!'' అని గౌరవించింది ఆమె.

''అన్నపూర్ణమ్మగారూ మా కమల కోర్కె వింటే నవ్వుతారు, మాకింకా వివాహం అయి ఏడాది అయింది! యిప్పటి నుండి ఆమెకు పిల్లల పిచ్చి పట్టుకుంది. మీ ఆశ్రమంలో మంచి పాపాయి వుంటే, పెంచుకుందికి మేమిద్దరం నిశ్చయించుకున్నాం'' అని నవ్వుతూ అన్నాడు ఆనందరావు.

''ఏంవమ్మా! నువ్వు చూస్తే చిన్నదానవు. ఏమిటీ నీకీ కోర్కె. ఎందుకింత తొందర పడుతున్నావు!'' అని అడిగింది అన్నపూర్ణ.

దానికి కమల సిగ్గుపడుతూ.

''ఏం లేదండి! నాకు చిన్నప్పటి నుండీ పిల్లలంటే సరదా, ఆయన ఆఫీసుకు వెళ్ళిపోతే నాకేమీ యింటి దగ్గర తోచదు... అందుకని...'' అని అన్నది.

''లాభం లేదండి. అన్నపూర్ణమ్మ గారూ మీరెంత చెప్పినా ఆమె అలాగే అంటుంది. నేనన్నివిధాలో చెప్పి చూశాను. నా మాట వినక మనోవ్యాధి పెట్టుగుంది. యిహ లాభం లేక వచ్చాము.''

అన్నాడు.

''మాకేమీ అభ్యంతరం లేదు. కాకపోతే దీనికి కొన్ని నిబంధనలూ, అవీ వున్నాయి, వాటికి మీరు కట్టుబడాలి. బాండ్ మీద సంతకం చేయాలి!''

''మరి తప్పుతుందా అలాగే చేస్తాము''

''అయితే సరే రండి ! లోపలికి, చూద్దురుగాని, అందులో మీకు నచ్చిన పిల్లాడిని చెప్పండి !'' అని అంటూ లోపలికి ఆహ్వానించింది.

ఆనందరావు తటపటాయించేడు.

''మీరూ రండి. లోపలికి'' అన్నది అన్నపూర్ణమ్మ.

''నేనెందుకు లెండి ! అంతా కమల యిష్టం. ఆమె వెళ్ళి చూసుకుంటేచాలును. తరువాత నేలగూ చూస్తాను లెండి. మరచేత కమలను తీసుకువెళ్లిరండి ! నేనిక్కడే వుంటాను ! ఏం కమలా!'' అని అన్నాడు.

''సరే మీ యిష్టం యిక్కడే వుండండి! వేగిరం వచ్చేస్తాం !'' అని దారితీసింది కమల. ఇద్దరూ లోపలకు వెళ్ళేరు. ఆనందరావు ఆలోచిస్తూ అక్కడే కూర్చుండిపోయాడు.

అన్నపూర్ణమ్మ, కమలా యిద్దరూ లోపలికి వెళ్లేరు, తనని పోల్చలేనందుకు కమల ఆశ్చర్యపోయింది.

''అన్నపూర్ణమ్మగారూ నన్ను పోల్చుకోలేదా ?'' అని అడిగింది.

''ఎక్కడో చూసినట్టే వుందమ్మా ! మరచిపోయాను'' అని ఆమె చెప్పింది.

''నేనండి కమలను, రెండేళ్ళ క్రితం, యీ ఆశ్రమంలో, నా బాబుని వదిలి వెళ్ళిపోయాను. జ్ఞాపకానికి రాలేదా !'' అని కంట తడి పెడుతూ అంది.

''ఓహో నువ్వా కమలా ?... అవునవును జ్ఞాపకం వచ్చింది. అప్పటికీ యిప్పటికీ చాలా మారిపోయావు. పెళ్లి అయిందా అమ్మా. ఆయన... మీవారా ? అదృష్టవంతురాలివి ?'' అని అంది.

''అవునండి'' అని అంటూండగానే పిల్లలందరూ ఆడుకుంటున్న చోటికి వచ్చేరు. ఆ వాతావరణం అంతా పిల్లల, ఆటల, పాటలతో ,కేకలతో, ఏడ్పులతో కిలకిలలాడుతూ వుంది. పరవశంతో కమల వారందరినీ చూస్తూ వుండిపోయింది. ఆమె కళ్లన్నీ నలుప్రక్కలా తిరుగుతున్నాయి. తన బాబు కోసం.

అక్కడ అందరూ అయిదేళ్ళు దాటిన పిల్లలున్నారు. తన బిడ్డ ఎక్కడా కనబడలేదు.

''చిన్న పిల్లలున్న చోటు చూపించండి'' అని అడిగింది.

''రా అమ్మా'' అంటూ మరో గదిలోకి తీసుకుపోయింది ఆవిడ. అక్కడ, అంతా ఏడాది మొదలుకుని - నాలుగయిదేళ్లవాళ్లందరూ ఆడుకుంటున్నారు. ఎన్నోరకాల బొమ్మలూ, ఆటవస్తువులూ వారి ముందర వున్నాయి. ఒకరిద్దరు ఆయాలు, దగ్గిరుండి ఆడిస్తున్నారు.

కమల గబగబా అందరి దగ్గరకూపోయి ఒక్కొక్కడినీ ఎత్తుగుని ముద్దులాడింది. ''అన్నపూర్ణమ్మగారూ'' అని ప్రశ్నార్థకంగా చూసింది అందర్ని చూసిన తర్వాత

''ఏం అమ్మా! చెప్పు ఎవరు బావున్నారో!'' అని అంది ఆమె!

''పిల్లలు బాగులేకపోడం ఏమిటండి? అందరూ ముద్దొస్తూనే వున్నారు!...''

''మరేమిటమ్మా ఆలోచిస్తున్నావు?''

''ఎప్పుడో పుట్టగానే మీ చేతుల్లో పెట్టి వెళ్లి పోయాను. యిప్పుడు...తల్లినే అయినా పోల్చుకోలేకపోతున్నాను... నాబాబును...'' అని సిగ్గుతో అంది!

ఆ మాటలు విని - అన్నపూర్ణమ్మ

''అయ్యో కమలా! ఒక వారం రోజులు ముందు వచ్చి వుంటే నీ బిడ్డ నీకు దక్కేది! నాలుగయిదు రోజులు క్రిందటే, ఎవరో ధనవంతుని లాగే వున్నాడు, అతను వచ్చి యిలాగే ఒక బిడ్డని పెంచుకుంటానని చెప్పి, చూసి తీసుకు వెళ్లాడు!'', అని చెప్పింది.

ఆ మాటలు విని గుండెలు పగిలిపోయినంత పని అయింది కమలకి.

''ఏమన్నారు?... ఏమన్నారు? ఎవరో వచ్చి తీసుకు వెళ్లిపోయారా? నా బాబుని?... అయ్యో ఎంత పాపం చేశాను! ఎంత దురదృష్టవంతురాలిని!... దేముడింకా నన్ను శిక్షిస్తున్నాడా? ఎలాగో అతనిని ఒప్పించి వచ్చాను... వాడికోసమే వచ్చాను. నా పాప వుంటాడు. నేనే తీసుకుపోయి పెంచుకుందామని ఆశపడి వచ్చాను.. చెప్పండి... ఎవరు తీసుకు వెళ్లారో... వాళ్లనయినా బ్రతిమాలి నా బిడ్డను తెచ్చుకుంటాను... ఎంతయినా యిస్తాను... చెప్పండి... అన్నపూర్ణమ్మగారూ! మీ ఋణం తీర్చుకోలేను... ఎందుకిచ్చేసేరు నా బాబుని... ఎందుకిచ్చేశారు?...'' అని ఏడవడం మొదలెట్టింది.

కమలను ఓదారుస్తూ అన్నపూర్ణమ్మ

''ఆవేశపడకు కమలా! మళ్లీ నువ్వే వస్తావని యిలా అడుగుతావని మాకేం తెలుసు? మా ఆశ్రమ ధర్మం నీకు తెలుసు. నీలాగే ఎవరో యువకుడు వచ్చాడు. అడిగి తీసుకు వెళ్లాడు. ముఖ్యంగా, నీ సంగతి అతనికెలా తెలిసిందో, నీపేరు చెప్పి, నీ బిడ్డనే యిమ్మన్నాడు... అందుకోసమే వచ్చానన్నాడు!'' అని అంది.

''ఆ... ఏమన్నారు? నా సంగతి అడిగాడా? ఎవరతను? అతనెవరో చెప్పాడా. నా రహస్యం ఎవరికీ తెలియదే!'' అని ఆశ్చర్యంతో అడిగింది.

''ఎవరో చంద్రం అని పేరు చెప్పాడు. ఎడ్రస్సు కూడా యిచ్చాడు, మీ బంధువే అని చెప్పేడు!''

అది విని అలాగే నిశ్చేష్టురాలయింది కమల.

''ఆ! చంద్రం! చంద్రం! వచ్చాడా! వచ్చి బాబుని తీసుకు వెళ్లాడా!...'' అని ఏడుస్తూ మూర్ఛపోయింది కమల.

అన్నపూర్ణమ్మ గాభరాతో, ఆయా, సత్యవతిని కేకవేసి, నీళ్లు తెప్పించి, ముఖం మీద జల్లి సేద తీర్చగానే, కమలకు తెలివి వచ్చింది.

ఆ చంద్రం పేరు వినగానే కమల యిల్లా అవడం, చంద్రం ఆమె బిడ్డనే తీసుకు వెళ్లడం యిదంతా చూశాక, అన్నపూర్ణమ్మ ఆ చంద్రం ఎవరయి వుంటారో గ్రహించింది. అంచేత కమల తేరుకోగానే...

''లే అమ్మా ధైర్యంగా వుండు.. యీ సంగతి నాకు మొదట తెలిసి వుంటే అతడిని అడిగి

వుండేదాన్ని. పోనీలే. యిదీ ఒకందుకు మంచిదే. అతని బిడ్డను అతనే తీసుకువెళ్లేడు. విచారించకు'' అని ఓదార్చింది.

కమల సిగ్గుతో తన మొఖం చూపలేక రెండు చేతుల్తోనూ కప్పుగొని వెక్కి వెక్కి ఏడ్వసాగింది. ఆ దుఃఖానికి అన్నపూర్ణమ్మగారి హృదయం కరిగిపోయింది - యింత ఆవేదన చెందుతుందని తెలిస్తే మరే బిడ్డనయినా చూపి నీదే వాడని చిన్న అబద్ధమాడి, తృప్తి పరచివుండేది కాని యిప్పుడామెను సముదాయించడం తప్ప మరేమీ చేతిలో లేదు.

''అయిందేదో అయింది. యింక నువ్వు ఆ బిడ్డమీదే, మనసుంచి అదే, దృష్టిలో వుంటే, నీ భర్తకు అనుమానం కలిగించినదానివవుతావు, యింత చిన్నతనంలో నువ్విలా పిల్లలకోసం పట్టుపట్టినా, నీ కోరిక మన్నించాడంటే అతనెంత మంచివాడో ఆలోచించు! అతని హృదయాన్ని, గాయపరచకు! - యీ బిడ్డ సంగతి మరచిపోయి, జీవితాన్ని హాయిగా గడుపు! త్వరలోనే మరో బిడ్డ కలుగవచ్చు కదా! వెళ్లమ్మా! అతను నీ కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు!'' అని ఎంతో నచ్చ చెప్పింది.

మరి చేసేది లేక కళ్లు తుడుచుగొని విచారాన్ని, దుఃఖాన్ని మరుగు పరచుగొని యివతలకు మెల్లగా వచ్చింది.

''పదండి! పోదాం!'' అని మెల్లగా అంది భర్తతో.

ఆమె ఒక్కర్తీ రావడం, పోదాం అని అనడం, వింతగా తోచింది ఆనందరావుకి. ఎందుకోసం వచ్చినట్టు? ఎందుకని వెళ్లిపోతున్నట్టు?

''ఇదేమిటి కమలా! ఇంత దూరం వచ్చింది ఎందుకు? వట్టి చేతులతో వెళ్లడానికా? ఏడీ నువ్వు పెంచుకోబోయే పిల్లడు?'' అని అడిగాడు ఆశ్చర్యంతో!

''నాకే పిల్లలూ వద్దు! పదండి పోదాం!... మీ మాట విన్నాను కాదు. మిమ్మల్ని కష్టపెట్టేను, మీరన్నదే నిజం. మనకెందుకిప్పటి నుండీ యీ బెడద!'' అని లేని ఆనందం తెచ్చుగుంటూ అంది.

ఆ మాట నమ్మలేక ''ఏం జరిగింది అన్నపూర్ణమ్మగారూ?'' అని అడిగాడు

''ఏం లేదండీ, ఆమెకెవరూ నచ్చలేదు! అంతే!''

''ఏమిటోనండీ! నాకేం అర్థం కాలేదు. యిన్నాళ్లు, పాపాయి, పాపాయి అని మనోవ్యాధి పెట్టుగుంది. నా కిష్టం లేకపోయినా, ఆమె కోసం ఒప్పుకుని వచ్చాక యిక్కడికి వచ్చి యిలా అంటున్నదీ!'' ఏమీతోచక అన్నాడు.

''నా మనోవేదన నాకే అర్థం కాలేదు..పదండి మీరేం బాధపడకండి. మరి మిమ్ములను వేధించను... పదండి యింటికి పోదాం!'' అని కమల తొందరపెట్టింది.

''సరే పద'' అని నిట్టూర్చి నడిచాడు.

ఇద్దరూ అన్నపూర్ణమ్మ గారి వద్ద సెలవు తీసుకుని యింటికి నడిచారు.

తరవాత కమల పరిస్థితి విచిత్రంగా తయారయింది. అటు, బిడ్డమీద మమకారం వదలుకోలేక, యిటు భర్తతో నిశ్చింతగా గడపనూ లేకపోయింది. ఎంత మనోధైర్యాన్ని కూడగట్టుకొని, బిడ్డని మరచిపోదామని ప్రయత్నించినా ఆమె శక్తికి మించిన పని అయిపోయింది. ఆఖరికి తన జీవితం తనే

చేతులారా నాశనం చేసుకుంటున్నట్లు, గ్రహించినా, ఏమీ చేయలేకపోతూంది, మనసు తన అధీనంలో లేకపోయింది.

ఆనందరావు ఎన్ని విధాల ఆమెను అనునయించినా, ఎన్ని విధాల ఆమెకు ఉత్సాహం కలుగజేద్దామని ప్రయత్నించినా లాభం లేకపోయింది. నయాన్న చెప్పి చూశాడు. భయాన్న చెప్పి చూశాడు. అయినా ఆమె మనిషి లోకంలో పడలేదు. కొన్నాళ్లపాటు యింటికి రావడం మానివేసి ఎంతో బాధపెట్టి చూశాడు. ఆమె మరింత దుఃఖంతో ఆహారం నిద్రా, మాని, ఆరోగ్యం పాడు చేసుకోడం తప్పితే మరేం ప్రయోజనం కనబడలేదు. కారణం తెలుసుకుందామని ఆనందరావు ఎంత అడిగినా అన్నిటికీ మౌనమే.

ఆఖరికి ఆనందరావు విసిగిపోయాడు. మొదట్లో ఆమెను వివాహం చేసుకున్నాక ఆమెను పొందడం తన అదృష్టమనుకున్నాడు, తన జీవితం, ఎంతో, ఆనందంగా హాయిగా, గడిచిపోతూందనుకున్నాడు. గాని, తగిన కారణం లేనిదే యిలా నిర్జీవంగా తయారవుతుందని భావించలేదు; కారణం చెప్పలేని ఆమెను చూసి అప్పుడప్పుడు ఆమెపై కోపం వచ్చినా, స్వతహాగా మంచి హృదయం కలవాడు కాబట్టి ఆమెపై జాలి కలగజొచ్చింది.

ఎంతో మంది డాక్టర్లకు చూపేడు, వాళ్లు చెప్పిన మందులన్నీ వాడాడు. కాని కమల మాత్రం తేరుకోనలేదు. రాను రానూ ఆమె మంచం పట్టింది. అది మనోవ్యాధి అని, ఆనందరావుకు తెలుసు, కాని దానికి కారణం మాత్రం ఆమె చెప్పదు. ఇంకేం చేస్తాడు, విసిగి వూరుకున్నాడు.

కమల మనోవ్యాధితో మంచం పట్టింది. ఒకనాడు జ్వరంతో తీవ్రంగా మూలుగుతూ, భర్తను పిలిచింది, ఆనందరావు వచ్చి మంచం మీద ఒక ప్రక్క కూర్చుని తల నిమురుతూ పలకరించాడు.

''ఇంకా దగ్గరగా కూర్చోండి! యివాళ ఎక్కడికీ వెళ్లకండి! నాకేదో భయంగా వుంది!'' అని కమల ఆయాస పడుతూ అంది.

''అదేమిటి కమలా! అలా అధైర్యపడతావు, మరేం గాభరా పడకు. నేను నీ దగ్గరే వున్నాను. అయినా చెబితే విన్నావు కాదు కదా!, ఆఖరికి వంటికి తెచ్చుగున్నావు. పోనీ, నీ మాటే కానీ అని ఆ ఆశ్రమానికి తీసుకు వెళ్లినా, ఎవ్వరూ నచ్చలేదని తిరిగి వచ్చేశావు.. ఏమిటో నీ మనస్తత్వం నాకేమీ నచ్చలేదు! ఎందుకిలా నీలో నీవు బాధపడతావు?'' అని అడిగాడు.

''మీకు అర్థం కాకపోవడమే మంచిది లెండి! ..పోనీండి! ... నాలోనేనే యిలా బాధపడడం మంచిది... నాకు తెలుసు, నేను బ్రతకను... యిటు చూడండి.. విన్నారా? నేను బ్రతకను.... అందుకే యిలా రండి... కూర్చోండి... దగ్గరగా!'' అని ఏడుస్తూ అంది.

''ఛా ఏం మాటలివి కమలా!... బాగా విశ్రాంతి తీసుకోమని చెప్పాడు, డాక్టరు. మరేం ఫర్వాలేదు. యింక అట్టే అలసిపోక పడుక్కో. మీ వాళ్లకు కూడా వుత్తరం వ్రాసాను. వస్తారు. నీ మనసుకు కొంచం వూరట కలుగుతుంది!'' అని మాటలు మార్చేడు. ఆమె దృష్టి మరల్చడానికి.

''మా వాళ్లకు ఉత్తరం వ్రాశారా? పోనీలెండి. మంచిపనే చేశారు! కడసారి చూసుకుని వెళతారు!... అంత వరకూ వుంటానో లేదో!'' అని అంది మొఖం ప్రక్కకు త్రిప్పి.

''అదేమిటలా అంటావు! నీకేం ఫర్వాలేదని డాక్టరు చెప్పేడని చెప్పేనా ?''

''వాళ్లలాగే అంటారులెండి.... మనోవ్యాధికి మందేమిటి ? ... నన్నెవరూ బ్రతికించలేరు. నేనెంత వేగిరం పోతే అంత మంచిది.... నేను పాపాత్మురాలిని, నేను మిమ్మల్ని మోసం చేశాను. తల్లి దండ్రులను మోసం చేశాను ! నన్ను నేను మోసం చేసుకున్నాను. మీలాటి అమాయకులకు, పుణ్యాత్ములకు నేను తగను. నా స్వార్థం కోసం మిమ్మల్ని వంచించాను - నాకోసం, మిమ్మల్ని, వుపయోగించుకొని, ఆనందిద్దామనుకున్నాను. యిందుకు భగవంతుడు నన్నెలాగూ క్షమించడు... మీరయినా క్షమిస్తానని అనండి.. నిశ్చింతగా కళ్లు మూస్తాను !'' అని ఆయాసంతో ఉద్రేకంతో అన్నది.

''ఏమిటీ మాటలు కమలా ! నీవు మతిపోయి మాటాడుతున్నావు. అలా విశ్రాంతి తీసుకో ! తర్వాత చెబుదూ గాని !''

''మరి నన్ను ఆపకండి, యిన్నాళ్లూ మీరడిగినా నే చెప్పలేదు, యీ రోజునే చెప్పదలచుకొన్నదేదో చెప్పనివ్వండి ! నేనింక దాచుకోలేను, నా హృదయంలో ఒక అగ్ని పర్వతం వుంది... తేలిక పరుచుకోనివ్వండి- నే చెప్పేది వినండి. లేకపోతే నాకు విముక్తి లేదు... విన్నాక నన్ను క్షమించండి, క్షమిస్తారా ?'' అని అతని చేయి తీసి తన చేతిలో వేయించుకున్నది.

ఆమె తొందరకూ, ఆవేదనకూ ఆశ్చర్యపోయి.

''ఎందుకంత మధన పడుతున్నావు ! నన్ను ఎరుగవా ? నువ్వేం తప్పు చేశావని, నేను క్షమించడానికి...పోనీ నువ్వే తప్పు చేసినా, నేనేమీ అనుకోను... నాకేం చెప్పనక్కర్లేదు. నేను క్షమించేను! యింకసరా ! నువ్వు హాయిగా కాస్సేపు పడుక్కో ! '' అని సమాధాన పర్చబోయేడు.

''నాకు తెలుసు మీరలాగే అంటారని కాని నే చేసిన పాపం చెప్పనివ్వండి... యింక మీరు కాక నాకెవరున్నారు ? మీ దగ్గర దాచి నేను వెళ్లలేను! నా ఆత్మకు శాంతి లేదు. నా హృదయం మీ పాదాల ముందు పెట్టి వెళ్లిపోతాను ! ... వినండి...'' అని అంది బలవంతపెడుతూ. ఆనందరావు ఆమె యింక చెప్పినా వినదని గ్రహించి శాంతంగా వినడం మొదలుపెట్టేడు.

కమల చెప్పడం మొదలు పెట్టింది....

''నేను హైస్కూల్లో చదువుతున్న రోజుల్లో.. ఒకనాడు మా క్లాసు పిల్లలందరం మా వూరికి దగ్గరగా వున్న ''వాటర్ ఫాల్స్'' దగ్గరకు ఎస్కర్షన్ వెళ్లాం...

ఆ ప్రదేశం ఎంత రమణీయంగా వుందని చెప్పను ? చుట్టూ కొండలూ, పెద్ద పెద్ద చెట్లూ, వాటి మీద పక్షుల కిలకిలలూ, ఆ మధ్యగా ఎత్తయిన కొండమీంచి వెండి కరిగించి పోస్తున్నట్టు జలపాతం...చూసి తీరాలి గాని నే చెప్పలేను... ఆ ఆనందంతో నా మనసు పరవశించిపోయింది... ఆ ప్రకృతి అందం నేనెక్కడా చూడలేదు! స్నేహితురాళ్లతో కలిసి కేరింతలు కొడుతూ, ఆడుతూ, పాడుతూ, గెంతుతూ ఎంతోసేపు గడిపాము...కాని నాకు అంతటితో తృప్తి తీరలేదు.

జలపాతానికి దగ్గరగా వెళ్లి చూడాలని, ఆ జలపాతంలో నీరు జారుతూ వుంటే చేయి పెట్టాలని అనిపించింది, ఆ మాటే వాళ్లతో చెప్పేను.

''వర్షం ధార అనుకున్నావా ? చేయి పెట్టడానికి, ఆ ధారలో సహా క్రిందికి జారగలవు సుమా !''

అని అన్నారు. అయినా నేను వదలలేదు... కనీసం దగ్గరగానయినా వెళ్లి చూడాలని అన్నాను... నాతో యిద్దరు ముగ్గురు కలిసారు, మిగతా వాళ్లు ''మేం రాం బాబూ!'' అని వూరుకున్నారు!

మేం నలుగురం, అంటే రాణి, సరోజ, శారద, నేనూ బయలుదేరాం. వాళ్లు వద్దని చెబుతున్నా వినక. మాతో పాటు కొందరు మగపిల్లలు కూడా వున్నారు. వాళ్లు కొంచం దూరంగా చెట్లెక్కి కొందరూ, యింకా ఎత్తయిన కొండల మీదకు కొందరూ మేం అనుకున్న వాటర్ ఫాల్స్ దగ్గరికి కొందరూ అప్పుడే చేరుకున్నారు.

మేం నలుగురం జలపాతం దగ్గరికి వెళ్లేం.

''సరోజా, శారదా రండర్రా! జలపాతం దగ్గరగా వెళ్లి చూద్దాం! ... ఆహా! ఎంత బా వుందో చూడండి!'' అని నేను స్నేహితురాళ్లతో అన్నాను.

''పదండి! పదండి!'' అని కేకలు వేస్తూ చప్పట్లు చరుస్తూ యింకా, యింకా దగ్గరకు పోయాం.

జలపాతం నుండి జారుతున్న నీటి తుంపరులు మా మీద పడుతున్నంత దగ్గరగా పోయాం...

''హాయ్! హాయ్! అబ్బ! ఎంత ఎత్తునుండి పడుతోంది! ఎంత చల్లగా రమణీయంగా వుందిక్కడ'' అంటూ నేను యింకా ముందుకుకి వెళ్లబోతున్నాను.

''జాగ్రత్త కమలా అంత దగ్గరగా వెళ్లకు. కాలు జారగలదు.. యిక్కడ నుండే చూసి పోదాం రా! యింకా క్రిందకు పోయి పవర్ హౌస్ అదీ చూడాలి. అప్పుడే ప్రొద్దుపోతూంది!'' అని హెచ్చరించింది రాణి..

ఆమె ఆ మాటలు అనడం ఏమిటి నా కాలు జారడం ఏమిటీ ఒక్కమారే జరిగిపోయినాయి.

''అమ్మో! అమ్మో! కమల ... కమల పడిపోతూంది!'' అని నా స్నేహితురాళ్లు గట్టిగా అరిచారు.

ఆ వేళతో నాకీ ప్రపంచంతో ఋణం తీరిపోయి వుండేది! నేను పడిపోతున్నాననే భయం నాలో ఎప్పుడు కలిగిందో అప్పుడే నాలో చెప్పలేని భయం ప్రవేశించి నా మతిపోయిది. కళ్లు మూసుకుపోయి అంతా చీకటి అయిపోయింది ఆ తర్వాత.... కొంతసేపటికి నాకు తెలివి వచ్చి చూసేసరికి నేను ఒక పొడి రాయి మీద పడుక్కొని వున్నాను. చుట్టూ, నాతోటి విద్యార్థినిలూ, విద్యార్థులూ, టీచర్లూ అందరూ మూగి నాకు వుపచారాలు చేస్తూ కనబడ్డారు.

భయంతో వణికిపోయాను, గుండెదడ యింకా తగ్గకపోయినా, బ్రతికి బయట పడ్డానన్న ధైర్యం వచ్చింది. నెమ్మదిగా అందరినీ చూస్తూ ఆయాసంగా నిట్టూర్చాను!

''కమలా! కమలా! నువ్వు చచ్చి బ్రతికావు! ... నీవు వాటర్ ఫాల్స్‌లో పడిపోవల్సిందే...కాని ... మన చంద్రం సమయానికి వచ్చి, నీ చేయి పట్టుగుని యివతలకు లాగివేయబట్టి బ్రతికేవు.... తెలుసా?'' అని శారద గబగబా అంది.

''ఎంత సాహసం కమలగారూ! అలా అంత ముందుకి పోతారా? ప్రమాదం కదూ?'' అని చంద్రం మొహంలో మొహం పెట్టి చూస్తూ అన్నాడు.

ఆ మాటలకూ, నేను చేసిన పనికీ సిగ్గుతో నేను మొహం ప్రక్కకు తిప్పుకుని ''థేంక్స్ చంద్రం గారూ!'' అని మాత్రం అన్నాను. అప్పటికీ నా గుండె యింకా కొట్టుకుంటూనే వుంది.

''బలే పనిచేశావే! నువ్వెప్పుడూ వద్దన్న పనే చేస్తూ వుంటావు! దేవుడిలా సమయానికి చంద్రం వచ్చి అడ్డుకో బట్టి గాని'' అని రాణి మొదలు పెట్టింది.

''లేకపోతే గంగలో కలిసి వుండేదాన్ని....'' అని నవ్వుతూ అనేశాను.

''ఇవాళ ఎవరి మొహం చూశామో! మా మర్యాద నిలబెట్టేవు, లేకపోతే దగ్గిరుండి తీసుకు వెళ్ళినందుకు మాకు వచ్చేది!'' అని టీచర్లు నిబ్బర పడ్డారు.

ఆ తర్వాత కొంచం స్వస్థత చెంది లేచి కూర్చున్నాను. ఎందుకో మళ్ళీ నన్ను రక్షించిన చంద్రానికి కృతజ్ఞత తెలుపుకోవాలి అనిపించింది.

''మీకు చాలా కృతజ్ఞురాలిని చంద్రం! నాకు ప్రాణదానం చేశారు, మీ ఋణం తీర్చుకోలేను'' అని అప్రయత్నంగా అనేశాను.

''ఆఁ! దానికేముంది లెండి! ఇందులో నా ప్రజ్ఞ మాత్రం ఏముంది? అదృష్టవశాత్తూనే చూడ్డం.. సరిగ్గా ఆ సమయానికి మీకు దగ్గరగా రావడం, కాలుజారిన క్షణంలోనే నేను లాగడం, మీరు రక్షింపబడడం యిదంతా కాకతాళీయంగా ఎలా జరిగాయో నాకూ ఆశ్చర్యంగానే వుంది. ఏది ఎట్లా వున్నా... నాది పేరు. యిలాంటి అవకాశం లభించినందుకు నేను చాలా గర్వపడుతున్నాను'' అని అన్నాడు చంద్రం.

''ఏది ఎట్లా వున్నా. మీరే గాని యీ రోజున లేకపోయివుంటే, మా కమల మాకు లేకపోను. మీకు మా అందరి తరపునా ధన్యవాదాలు'' అని నా స్నేహితురాళ్లందరూ అతనికి కృతజ్ఞత తెలిపారు.
- ఆ తర్వాత ఎవరి మానాన్న వాళ్లం ఇళ్లకు చేరుకున్నాం.

అని చెపుతూ కమల ఆయాసంతో ఒక ఘడియ వూరుకుంది. మంచినీరు యిమ్మని త్రాగి, మళ్ళీ మొదలు పెట్టింది. టేబుల్ మీద వాచీ ఆరుంపావయింది. గ్రుంకబోతున్న సూర్యుడు తన తీక్షణతను తగ్గించి, భూమీ ఆకాశం కలిసేట్టుండే - చోటుకి దగ్గరగా వచ్చి, భూదేవి పెట్టుగున్న కుంకుమ బొట్టులా వున్నాడు....

ఉన్నట్టుండి, పెద్ద గాలి వీచడం మొదలెట్టింది... కమల పడుకున్న గది కిటికీ తలుపులు ఆ గాలికి టపటపా కొట్టుకున్నాయి... చెపుతున్నది ఆపి - ఆ కిటికీ వయిపు భయంభయంగా చూస్తూ

''ఆ కిటికీ తలుపులు మూయండి, నాకేదో భయంగా వుంది'' అని అంది కమల; ఆనందరావు లేచి, కిటికీ వైపు వెళ్లేడు, అతనికీ ఆశ్చర్యంగానే వుంది. ఒక్కసారి వాతావరణం అలా మారిపోడానికి - అప్పటికప్పుడే చిన్న జల్లు ప్రారంభించింది. ఆకాశం మీద మబ్బులు పోటీపడి పరుగెత్తుతున్నాయి.... తలుపులు మూసి మళ్ళీ కమల దగ్గరికి వచ్చేసరికి అవతల పెద్ద చప్పుడులో వర్షం కురుస్తున్నది. ఉరుములూ, మెరుపులూ ఏదో ప్రళయంలా వుంది.

''ఏమిటండీ యింతవర్షం. యీ గాలీ, వాన, ఏదో ఉప్పెనలా వుంది... చలి వేస్తూంది.. ఆ రగ్గు కప్పండి!'' అని అంటూ ముడుచుకు పోయింది కమల.

''ఏముంది వర్షం వచ్చింది. అనుకోకుండా ఏ సూచనా లేకుండా రావడం వలన యిలా అనిపిస్తూంది అంతే..'' అని అంటూ దగ్గు కొస్పేడు ఆనందరావు.

మళ్లీ మెల్లగా తన కథ ప్రారంభించింది కమల.

''ఆ విధంగా ... ఆనాడు .... జలపాతంలో కాలుజారిపడకుండా ... అతడు రక్షించాడు.. అలా రక్షించి వుండకపోయినా బాగుండిపోను ! యీనాడిలా జీవితంలో కాలుజార్చి బాధపడి వుండకపోదును...'' అని కంట తడిపెట్టింది.

''ఆ తర్వాత ఏమయింది కమలా ?'' అని కుతూహలంతో అడిగాడు.

'' ఆ తర్వాత ఏమిటో తెలియని అభిమానం, ప్రేమ అతనిమీద నాకు కలిగేయి. రోజూ అతనిని క్లాసులో చూసేదాన్ని. అతనూ,చూసేవాడు. ఇంతకు పూర్వం లేని ఏదో తెలియని కోర్కె, సిగ్గూ కలిగేది. నా హృదయంలో అతడు గాఢంగా హత్తుకుపోయాడు. .. నాకు తెలియకుండానే, నాలో ఒక్క గొప్ప స్థానాన్ని ఆక్రమించుకున్నాడు... అతనితో మాటాడాలని వుండేది. కల్పించుకొని అప్పుడపుడు ముచ్చటగా మాటాడేదాన్ని. యిదంతా ఎవరికీ తెలియదు. ఆనాడు జరిగిన సంఘటన అందరూ అతివేగిరం మరచిపోయినా నేను మాత్రం మరువలేకపోయాను - నాలో ఒక సంచలనం కలిగించింది, నేను మారిపోతున్నాను. నా మీద అతనికేదో హక్కు వున్నట్టు అనుకొనేదాన్ని. నాకు చేసిన ఆ మహోపకారం ఊహించుగానే సరికి అతనికి ఏ రూపంలో కృతజ్ఞురాలినై వుండాలో తెలియక బాధపడేదాన్ని. నా నుండి అతడేదయినా ఆశించాలని, అది నావల్ల జరిగి తీరాలని అనుకొనేదాన్ని. కాని అతనేం కోరేవాడు కాడు. అతడు నాతో పూర్వం కన్నా ఎక్కువ చనువుగా వున్నా నేను అభ్యంతర పెట్టేదాన్ని కాదు. అతనేం కోరకపోయినప్పటికీ అతనికి నేను మరీ దాసురాలనయిపోయాను. ఆ పరిస్థితుల్లో అతడేం కోరినా కాదనే శక్తి నాలో లేకపోయింది... శృతి మించింది. యిద్దరి మధ్యా వాంఛతో కూడిన స్నేహం ఏర్పడింది...

ఆనాటి... ఆ సంఘటనే... ఒకరోజు పొరపాటుకి .... ఆ పాపపు క్షణానికి దారి తీసింది...'' అని వెక్కి వెక్కి ఏడుస్తూ మరి చెప్పలేకపోయింది. ఒక నిమిషం వూరుకొని మళ్లీ చెప్పడం ప్రారంభించింది.

''ఒకనాడు.. నా స్నేహితురాలు రాణి యింటి నుండి వస్తున్నాను - కొంచం ఆలశ్యం అయింది.. అప్పటికపుడే సాయంత్రం అయిందేమో, మసక మసకగా, చీకటి ఆవరించుకుంటూంది, ఇంటికి వేగిరం చేరుకోవాలన్న కోర్కెతో గబగబా నడిచిపోతున్నాను - ఒక పెద్ద రావి చెట్టు దగ్గరిగా వచ్చేను....

ఆ చెట్టు చాలా పెద్దది, ఆ చెట్టుమీద గూళ్ళు కట్టుకొని వుంటున్న పక్షులు గోలగోల పెడుతున్నాయి. చెట్టుక్రింద కట్టిన చపటా మీద కూడా మనుషులు అట్టేలేరు, కొంచం వెలుతురు చుట్టూ వున్నా దట్టమయిన ఆకులుతో వున్న ఆ చెట్టు నీడవల్ల అంతా చీకటిగా వుంది.

ఆ చెట్టు క్రింద నుండి వేగిరంగా వస్తున్నాను. యింతలో వెనకనుండి.

''కమలా ! కమలా ! ఎక్కడికి అంత తొందరగా వెళుతున్నావు !'' అని వినిపించింది. తిరిగి చూస్తే ఆ పిలిచేది మరెవరూ కాదు చంద్రం !

''హలో ! చంద్రం ! యిలా రాణి యింటికి వెళ్ళి వస్తున్నాను.... చీకటి పడుతూంది కదా అని వేగిరం పోతున్నాను... మీరెక్కడి నుండి వస్తున్నారు ?'' అని అడిగాను

''అరే ! నీకు తెలీదా ? నా లాడ్జీ యిక్కడే, అదుగో ఆ ప్రక్కనే యీ చెట్టు నీడలో ...రా... ఒక్కసారు చూసిపోదూ గాని !'' అని అన్నాడు.

ఒక ప్రక్క వెళ్ళాలని వున్నా, ఆ సమయంలో, ఎందుకో వెళ్ళాలని అనిపించలేదు. అందుకనే -

''ఇప్పుడు కాదు చంద్రం. చాలా ఆలశ్యం అయిపోయింది... మాశానుగా. మరోకప్పుడు తప్పకుండా వస్తాలే !...'' అని అన్నాను, కాని అతను

''ఫర్వాలేదు కమలా ఒక్క క్షణానికేనా ? యిలా వచ్చి కూర్చొని పోదూగాని, నేను రమ్మంటున్నాగా రావా ?'' అని పట్టుపట్టాడు.

''ఈ సమయంలో నే రావడం బావుండదు చంద్రం. ఎవరయినా చూస్తారు. అంత పట్టింపు ఎందుకు! లాడ్జీకి వచ్చి ఏం చేస్తాను ? ... ఏమీ అనుకోకు !''

''కమలా నిన్నెప్పుడూ నేనేమీ అడగలేదు ! యీరోజు అనుకోకుండా నా లాడ్జీ వయిపువచ్చేవు ! లోపలికి తీసుకు వెళ్ళకుండ ఎలా వుండగలను ? నువ్వు తప్పకుండా రావాలి. యీ చెట్టు నీడలో ఎవరూ చూడరులే ! '' అని బలవంతపెట్టాడు.

మరి నేను కాదనలేకపోయాను. ''సరే పదండి'' అంటూ అతనిని అనుసరించాను - ఆ ప్రక్కనే ఒక మేడ యిల్లు వుంది - వీధిలోంచి మెట్లు వున్నాయి, మీదను అతని లాడ్జి లోపలకు తీసుకు వెళ్ళాడు.

''రా...యిలా కూర్చో కమలా ! ఏదో బ్రహ్మచారి గాడు వుండేగది. మీ ఆడపిల్లల్లా సర్దుకోవడం అదీ వుండదుగా...'' అని ముందరే చెప్పేశాడు. అతను అన్నట్టుగానే ఆ గది అంతా చిందర వందరగా వుంది. ఏ ఒక్కటీ ఏ ఒక్కదానికీ కేటాయించి లేదు. పుస్తకాలు, టేబిల్‌మీద, షెల్ఫ్‌లోనే కాకుండా ప్రక్కమీద, నేలమీదా, కుర్చీమీదా కూడా వున్నాయి. ప్రక్క శుభ్రంగా పరచిలేదు...తొడుక్కొనే బట్టలు కూడా పడేసి వున్నాయి.

గోడకు కట్టిన తాడుకి పాత బట్టలన్నీ వ్రేలాడుతూ వున్నాయి. క్రింద ఎన్నాళ్లనుండీ తుడిచిన పాపాన్ని పోలేదో దుమ్మూ, ధూళీ అంగుళం ఎత్తున కూడుకుని వుంది.

గబగబా మంచం మీద బట్టలూ, పుస్తకాలూ ఉమ్మచుట్టి - క్రింద పడేసి నన్ను కూర్చోమన్నాడు.

అక్కడ నుండి ఎంత వేగిరం బయట పడదామా అని వున్నా వెళ్ళేక మాటాడక తప్పుతుందా ?

''అన్నట్టు కమలా ! నీకో చిత్రం చూపెడతా ? అసలు అందికే నిన్ను రమ్మన్నది !'' అని నవ్వుతూ అన్నాడు

''ఏమిటా చిత్రం ! బలే మాటాడుతారే మీరు ?''

''ఇదిగో చూడు !'' అని నా చేతిలో ఒక ఫోటో పెట్టేడు.

అది నా ఫోటోనే, అతనికెలా వచ్చిందో అర్థంకాలేదు. నే నెప్పుడూ అట్లా ఫోటో తీయించుకోలేదు. ఆశ్చర్యంతో -

''అరే! యిది నా ఫొటోనే! యీ వెనక చెట్లూ కొండలూ, వాటర్‌ఫాల్స్, యిది మీకెక్కడి నుండి వచ్చింది? ఎవరు తీశారు? నాకు తెలీనే లేదే!'' అన్నాను.

''అవును. నీకు తెలియకుండా మొన్న ఎక్స్‌కర్షన్‌లో నేనే తీశా!''

''అయితే దొంగతనంగా నా ఫొటో తీసి దాచుకున్నారన్నమాట! మీ దగ్గర దీనిని ఎవరయినా చూస్తే ఏమనుకుంటారు?'' అని అడిగాను.

''ఎవరు చూడగలరు కమలా? దీనిని ఎక్కడ దాచుకుంటున్నాననుకున్నావు? నా హృదయంలో, నిజం కమలా. నువ్వు నా హృదయరాణివి! నీతో యిన్నాళ్లూ చెప్పడానికి ఏదో భయంగా వుండేది కాని యీనాడు, సమయం, అవకాశం దొరికింది! ధైర్యం చేసి చెప్పేశాను... ఆ రోజున నువ్వు జారిపోతూవుంటే నీ చెయ్యి పట్టుకున్నానో లేదో, ఆ జలపాతంలోని విద్యుశ్ఛక్తి అంతా నీలో వుందా అనిపించింది. !... నిన్ను పట్టుకోగానే ఆ కెరంటు నాలో ప్రవేశించింది.... ఏం చెయ్యను?'' అని నవ్వుతూ అన్నాడు.

''అవేం మాటలు! కవిత్వం చాలుగాని... యింక నే వెళతాను'' అంటూ లేవబోయాను.

''కూర్చో కమలా రాక రాక వచ్చావు! నిన్ను కళ్లారా చూడనీ!'' అంటూ దగ్గరగా వచ్చాడు.. లేవబోయి మళ్ళీ కూర్చుండిపోయాను.

''ఏమిటిది చంద్రం! యిట్లాగయితే రాకపోదును.. అవేం మాటలూ?'' అంటూ ప్రక్కకు జరిగేను.. ఆయన ఆ మాటలు వినిపించుకోలేదు.

''కమలా నిజం చెబుతున్నాను... ఆనాటినుండి నాకు చదువు తలకెక్కలేదు. తిండి అంతకన్నా సహించలేదు, నిద్ర రాలేదు! నేనే పనిచేసినా, ఎక్కడ వున్నా,... నీవే కళ్ల ముందు. నీ ఆలోచనే, నీ వూహాలే, తప్ప వేరే ధ్యాస లేదు... నా మనసు - మనసులో లేదు! నన్ను నమ్మవా? నా హృదయాన్ని ఎలా విప్పి చెప్పేది? నిన్ను నేను మనసారా ప్రేమిస్తున్నాను... కాదనకు... నువ్వు చెప్పకపోయినా నువ్వు నన్ను ప్రేమిస్తున్నావో లేదో నాకు తెలుసు... అవునా?'' అని ఉద్రేకంతో నా చేతులు పట్టుకుని అడిగేడు.

ఆ స్పర్శ నాకు మత్తు ఎక్కినట్టు చేసింది... సిగ్గుతో.

''అయితే మాత్రం!'' అని తలవంచుకున్నాను. నా శరీరం పులకించి, వణకడం ప్రారంభించింది. పెదిమలు తడబడ్డాయి. ఆ తర్వాత ఏమనడానికీ నోరు మెదలలేదు.

''ఏమిటి నీ సందేహం కమలా!... అవును... నాకు తెలుసు... నీ భయం... ఫర్వాలేదు, చదువూ సంస్కారం గలవాడిని, ఆ బాధ్యత నాకు తెలీదంటావా? నిన్ను మోసం చేయగలనా? అన్యాయం చేస్తానని అనుకుంటున్నావా? అలా ఎన్నటికీ జరగదు. మనిద్దరం వివాహం చేసుకుందాం!.... ఏమంటావు?'' అని చేతులు వదిలి భుజాలు పట్టుకొని అడగడం ప్రారంభించేడు.

''బావుంది చంద్రం. మనకిష్టమయితే సరా? మన పెద్దవాళ్లు యిష్టపడ వద్దా?'' అని ఎలగో అనేశాను. అప్పటికి నాలో శక్తి నశించిపోతూంది. ఎక్కడో తేలిపోతున్నట్టు అనిపించసాగింది. అతని స్పర్శ నన్ను లోబరుచుకుంటూంది.

''నిజేసంలా యిష్టపడతారు... ఏ విషయంలోనూ అభ్యంతరం వుండవలసిన అవుసరం ఏముంటుంది? అంతకీ యిష్టపడకపోతే నేను స్వతంత్రుణ్ణే. ... నీకెందుకా భయం ? నిన్ను విడిచి జీవించలేను. నేనెక్కడ వుంటే నువ్వూ అక్కడే వుంటావు. ఏమంటావు కమలా ? ... నీకింకా అనుమాన మెందుకు?'' అని అతను తల మీద చేయి వేసి అడిగేసరికి, నాలో మాటాడే శక్తీ, కాదనలేని శక్తీ అన్నీపోయాయి. అతని వెచ్చని కౌగిల్లో వెన్నలా కరిగి వుండి పోయాను, ఏమీ జవాబు చెప్పకపోయేసరికి-

''నేనెంత అదృష్టవంతుణ్ణి కమలా ! నువ్వు అంగీకరించావు... యింక నిన్ను వదులుకోలేను....'' అంటూ నన్ను దగ్గరగా తీసుకున్నాడు.

ఆ తర్వాత అతనేం చేసినా ఎదుర్కొనే శక్తి నాలో నశించిపోయింది. అలాగే ఆ మంచం మీద ఒరిగి పోయాను.

ఆ విధంగా అతడు నన్ను మైమరిపించి, పరవశురాల్ని చేసి వశం చేసుకున్నాడు. అక్కడకు వెళ్లాక తిరిగి వెళ్లిపోరావడం నా చేతిలో లేకపోయింది. ఆ పరిస్థితులలో ఎంతసేపూ నా కంటికి.... అతడు నన్ను జలపాతంలో పడకుండా కాపాడే దృశ్యమే అవుపించుతూ, అతనికి నన్ను దాసురాల్ని చేసింది. ఆ సమయంలో అతను ఏది కోరినా దానిని కాదనేశక్తి నాలో లేకపోయింది. ఆ లాడ్జీకి వెళ్లేసరికే ఏదో లోకం లోకి వెళ్లినట్టనిపించింది. అనుభవం లేక అమాయకంగా అతని మాటలకి లొబడి అతనికి ఆ పాపపు క్షణంలో లొంగిపోయాను... నా సర్వస్వం అతనికి ధారపోసి వచ్చేసేను...'' అని చెబుతూ, కమల...మరి చెప్పలేక రెండు చేతులతోనూ ముఖం కప్పుకొని భర్తకు మొహం చాటుచేసి, ఏడవడం మొదలు పెట్టింది.

ఆ ముక్కలు విని పెద్ద అఘాతం తగిలిన వాడిలా వుండిపోయాడు. ఆనందరావు. హృదయం, మనసు, అగ్నిజ్వాలలు వ్యాపించినట్టయింది. కాని ఆమెను ఏమనడానికి అది సమయంకాదు, కనీసం ఎందుకలా చేశావు అనేనా అడిగే పరిస్థితిలో ఆమె లేదు. అందువల్ల మనసులోని వేదన తమాయించు కున్నాడు.

ఆమె ముఖం మీద నుండి చేతులు తీసి -

''సరేలే కమలా ! తరవాత ఏమయిందో మళ్లీ చెప్పవచ్చు... విశ్రాంతి తీసుకో'' అని అక్కడ నుండి లేవబోయినాడు.

''లేదండీ... చెప్పనివ్వండి... జరిగిందంతా చెప్పి మీ పాదాలముందు ప్రాణం వదిలితేనేగాని నా ఆత్మకు శాంతి లేదు'' అని అతని చేతులు పట్టుగు కూర్చోబెట్టింది.

ఆమె మళ్లీ మొదలెట్టింది.

''తర్వాత నా పొరపాటు అర్థమయి ...నివారించాను... యింక ఆ తర్వాత అంత దుఃఖమయమే.... చీకటే - యింక నాలో నేను ఏడవడం తప్పితే యింకేం చేయలేకపోయాను... ఎవరితో చెప్పుకొనేది.! ... అతనితో తిరగి మాటాడ్డానికే, అతనిని చూడ్డానికే సిగ్గనిపించింది... అతని దగ్గర నేను ఓడిపోయినట్టు ... భావించి, అతనికి దూర దూరంగానే మెలుగుతూ వచ్చాను...

నలుగురిలోనూ తలెత్తుకు తిరగడానికి, నాకే చిన్నతనంగా వుండేది, యీ విషయం ఎవరికీ తెలికయపోయినా... అందరికన్నా నేను హీనురాలనయిపోయినట్టు అనిపించేది.

కొన్నాళ్లకి నా పొరపాటుకి ప్రాయశ్చిత్తంగా నాలో మార్పు రానేవచ్చింది. భయం కొద్దీ ... నేనప్పటివరకూ దాచివుంచినా... నే చెప్పకుండానే మా అమ్మపసికట్టింది. నేను తల్లిని కాబోతున్నానని... ఒకనాడు ఆ సంగతి బయట పడక తప్పలేదు. ...

నాకు మొహం చెల్లక ఏడుస్తూ కూర్చున్నాను.... నాన్న అమ్మ...నన్ను మాటలతో చిత్రవధ చేయడం మొదలెట్టేరు.

''ఎంత పనిచేశావే ? చదువుకున్నదానివి కదా ! అని స్వతంత్రం యిస్తే యిదా నీ వివేకం ? యిప్పుడు నీ గతి ఏమవుతుంది ?... నీ కళ్లు మూసుకుపోయాయా? ముందూ వెనకా ఆలోచించుకోకుండా యిలాంటి పని చేశావు ? ... ఆడపిల్లవి, మళ్లీ నీకు పెళ్లి ఎలాగవుతుంది ? యింక ఏ నూతిలోనో గోతిలోనో నిన్ను పడేసి నేనూ చావాలిగాని... యిలాటి కూతురని అందరూ ఎత్తిపొడుస్తూ వుంటే, నేనెలా తలెత్తుకు తిరిగేది ?... అంతన్నా వాడితోనే లేచి వెళ్లిపోలేకపోయావా ? నువ్వు పుట్టలేదనే అనుకుందును ! యీ చిత్తక్షోభ మాకెందుకు ?.... అవ్వ ! కడుపు చించుకుంటే కాలుమీద పడుతుంది. ఎంత అప్రతిష్ఠ! '' అని మా అమ్మ తిట్టడం మొదలెట్టినది.

నేను చేసినది తప్పు అయినా, అతనింకా నన్ను ఉద్ధరిస్తాడన్న నమ్మకంతో మా అమ్మ మాటలను సహించలేకపోయాను.

''ఎందుకే అమ్మా అలా వూరికే అంటావు. అతనూ నేనూ పెళ్లి చేసుకుంటాం !'' అని అన్నాను.

''ఏదీ... ఆ వుద్దేశ్యం వున్నట్టయితే... అతనిని తీసుకుని రాలేకపోయావా ? .... అయినా అతను ఏదో మంచిమాటలాడేసరికి, యిలాటి పనిచేస్తావా ? అవసరం తీరాక, యిక నిన్ను చూస్తాడనేనా ? కొంప మునిగినా... నీకు చీమకుట్టినట్టయినా లేదా ? తిరిగి అడ్డంగా వాదిస్తున్నావు!''

''చంద్రం అలాటివాడు కాదమ్మా! తప్పకుండా నన్ను పెళ్లాడుతాడు!'' అని నేను అనేసరికి అంతవరకూ వూరుకున్న మా నాన్న కోపం పట్టలేక -

''ఛీఛీ ఎంత అప్రతిష్ఠ... మన వంశంలో లేదు; నా కూతురిలాంటి పని చేసిందంటే నేనెలా నలుగురిలోనూ మెలిగేది ? అందుకే ఆడవాళ్లకి చదువులు చెప్పించకూడదు ... కాస్త స్వతంత్రం యిస్తే..యిదా చేసేది ? ఎంత అమర్యాద! యింతకన్నా అందరం ఏ విషం తినో చస్తే మంచిది...యింక నీ మొహం చూపెట్టకు... ఫో... వాడితోనే కనబడకుండా లేచిపో... నువ్వు నా కూతురివే కాదనుకుంటాను..'' అని బిగ్గరగా కేకలు వేయడం మొదలెట్టేసరికి.

''ఇక వూరుకోండి! మీరు మరీని. వీధిని పెట్టుకుంటామా ? నోరు మూసుకుంటే మనకే నష్టం... యిప్పటికేనా మించిపోలేదు, నలుగురి నోట్లోనూ పడకముందే ముందు జాగ్రత్త పడడం మంచిది. ..అయిందేదో అయింది.... యింక జరుగబోయేదేదో ఆలోచించండి...'' అని శాంతపరచ చూచింది.

పరిస్థితి గ్రహించి నాన్నగారు కోపం అణచుకొని -

"ఇంతజరిగాక ఆ అబ్బాయి పెళ్లాడుతాడంటావా ? ఇప్పుడేం చేయడం ?" అని అడిగాడు.

"పెళ్లి సంగతి తాపీగా అడిగి తెల్సుకోవచ్చు... ముందు... రెండో కంటివాడికి తెలియకముందే ఏదో రహస్యంగా జరిగిపోయే ఉపాయం ఆలోచించండి..." అని అన్నది.

"ఇంక తప్పుతుందా ? చేసుకున్న వాళ్లకు చేసుకున్నంత ! ఇలాటి.. పాపపు పనులు చేస్తే... సరే... ఇంక దాన్ని అనడం దేనికి ! అన్నపూర్ణమ్మగారి ఆశ్రమం వుంది కదా - అందులో చేర్పిస్తే సరి ! అన్నీ జరిగాక తీసుకురావచ్చు ! ఎక్కడికి వెళ్లింది ! అని ఎవరయినా అడిగితే మీ తమ్ముడుగారింటికి వెళ్లిందని చెప్పవచ్చు... కలిసివచ్చినట్టు - సెలవలు కూడా ఇంక ఇచ్చేస్తారు; ఆపైన భగవంతుడే వున్నాడు.. ఏం చేస్తాం ! రెండో కంటివాడికి తెలియకుండానే ఈ పని జరిగిపోవాలి.. ఈలోపున ఆ అబ్బాయి వాళ్ల దగ్గరకు కూడా వెళ్లి అడుగుతాను... ఏమంటారో !"

"అదేం ఆశ్రమమో ఏమో ! ఏదీ తెలియకుండా పిల్లని అక్కడ ఎలా వదిలేస్తాం !"

"దాని గురించి నాకు తెలుసు ! ఇలాంటి విషయాల్లో, ఆ ఆశ్రమం వాళ్లు చాలా సహాయం చేస్తారు, మనకిష్టం లేకపోతే, ఆ సంతానాన్ని కూడా వాళ్ళే పెంచుకుంటారు - అంతా రహస్యంగా వుంచుతారు!"

"అదీ ఒకందుకు మంచిదే ! అయితే మరిక ఆలస్యం చేయకుండా, అలా చేయండి ! మళ్లీ మన పిల్ల మనింటికొచ్చి మనుష్యుల్లో పడితే చాలు ..." అంటూ.

"ముద్దూ ముచ్చట్లూ తీరుద్దామనుకుంటే ఇలా చేసేవేమే తల్లీ" అని ఏడుస్తూ కూర్చుంది.

"అయిందేదో అయింది... ఇంక వూరుకోవాలి" అంటూ మా నాన్నగారు బయటకు వెళ్లిపోయారు.

ఆ తర్వాత నన్ను తిట్టినా, తల్లీ, దండ్రీ కాబట్టి, నన్నూ నా రహస్యాన్ని కడుపులో పెట్టుగొని దాచేరు.... నా నుండి జరిగిన అవమానాన్ని సహించలేక ఒకనాడు... ఆత్మహత్య చేసుకుందామని ప్రయత్నించాను... కాని అది తెలిసిపోయి మరింత కృంగిపోయాను.

ఇంక ఆలస్యం చేస్తే ఏం అఘాయిత్యం చేస్తానో అని ఆ మర్నాడే నన్ను అన్నపూర్ణమ్మ గారి ఆశ్రమంలో చేర్చారు - నేను మా మేనమామ గారింటికి వెళుతున్నానని అడిగిన వాళ్లతో చెప్పేను. మా వాళ్లూ కూడా అందరితోనూ అలాగే చెప్పడం చేత ఇదంతా ఎవ్వరికీ తెలియలేదు ! అంతా గుట్టుగా జరిగిపోయింది. అదృష్టవశాత్తూ ఎవ్వరూ పసికట్టడానికి అవకాశం కలుగలేదు....

కొన్నాళ్లుపోయాక...కొడుకుని కన్నాను...

ఆ పసి బిడ్డను అక్కడే వదిలేసి... జీవితంలో ఇంకా ఏదో ఆశతో, బయటకు అమాయకురాల్లా వచ్చేసాను.. ప్రపంచానికి, నేను అవివాహితనే... ఏమీ ఎరుగని మిమ్మల్ను వంచించి, వివాహం చేసుకున్నాను.... ఏమీ ఎరుగని దానిలాగ నటించి, నమ్మించి ద్రోహం చేశాను....కాని... నా బాబు మీద అభిమానాన్ని చంపుకోలేకపోయాను - మీతో సంసారం చేస్తున్నానే గాని .... నా మనస్సెప్పుడూ నా బిడ్డ మీదే వుండేది... అందుకే మీతో పాటు ఆనందంగా, సంతోషంగా

గడపలేకపోయేదాన్ని. లోకానికి విరుద్ధంగా అసహజంగా బిడ్డని పెంచుకుందామని మీతో పోరేను... ఎందుకంటే ఆ మిషతో - మిమ్మల్ని ఒప్పించి, పెంపకం అనే పేరుతో, ఆశ్రమానికి తీసుకువెళ్ళి నా బాబునే మన యింటికి తెచ్చుగాని పెంచుకోవచ్చునని ఆశపడ్డాను.... కేవలం నా స్వార్థంకోసం, మిమ్మల్ని వేధించుకు తిన్నాను... మీరు అమాయకులు కాబట్టి, మంచివారు కాబట్టి, నా కోర్కె, ఎంత అస్వాభావికమయినా, నాకోసమని అంగీకరించారు...కాని భగవత్తుల్యులయిన మిమ్మల్ని అన్యాయం చేశాను! ... అందుచేత నన్ను ఆ భగవంతుడు కూడా క్షమించలేదు...

ఆనాడు మనం పిల్లలకోసం ఆశ్రమానికి వెళ్లాం కదా... నేను లోనికి పోయి అందరినీ చూశాను... కాని నా బిడ్డ అక్కడ లేడు... నాకు నిరాశతోపాటు అదో విధమయిన బలహీనత పట్టుకుంది. ఆమెను అడిగి తెలుసుకున్నాను. అసలు విషయం,...నా బాబు వెళ్లిపోయాడు... ఎవరింటికో కాదు... తన తండ్రి యింటికే వెళ్లాడు... ఆ చంద్రం వచ్చి తీసుకు వెళ్లేడట ! నమ్మలేకపోయాను... నన్ను మోసం చేసి - అన్యాయం చేసిన అతనికి... నా మీద లేని ప్రేమ ... నా పిల్లడి మీద ఎందుకా ? అనిపించింది. ఆ విధంగా రెండు విధాల చెడినదానినయ్యాననే విచారం వల్ల, ఆ మాట వినగానే మూర్ఛపోయాను.

మీరు అభం శుభం ఎరుగని వారు... మిమ్మలను వంచించాను, ఎవరికీ పనికిరాని జీవితం నాది!.... అటు చంద్రానికి, బిడ్డకీ, మీకూ ఎవరికీ, నా విధి నేను, నిర్వర్తించలేకపోయాను... ముఖ్యంగా మీకు అనుకూలంగా జీవించలేకపోయాను...పోనీండి... నా దగ్గరకాకపోయినా... నా బిడ్డ ఎక్కడ పెరగాలో అక్కడ అర్హత గల యింట్లోనే పెరుగుతున్నాడు... పెద్దయేక తండ్రిలేనివాడని అనిపించుకోడు... యీ ప్రపంచంలో తల్లిలేనివాడయినా ఫర్వాలేదుగాని తండ్రి తెలియని వాడయితే అవమానం! ... నేను చంద్రం దగ్గరకు వెళ్లలేను... వెళ్లను... అడగలేను... ఎంత పాపాత్మురాలిని ! ఎంత దురదృష్టవంతురాలిని ! నన్ను క్షమించండి! మీకు అర్ధాంగిగా జీవించే భాగ్యం నాకు లేదు... అంత యోగ్యత నాకు లేదు... యీ ఆలోచన నన్ను ప్రతిక్షణమూ వేధించి వేస్తూంది... యిప్పటికి... నా ఆవేదన కొంచం తీరింది... యిప్పటికయినా మీరు క్షమించానంటే - చాలు... నాకు మరే ఆశాలేదు...హాయిగా వెళ్లిపోతాను ! క్షమించాననండి!'' అని అంటూ మరి నోటంట మాటలు రాక కంట నీరు విడుస్తూ వూరుకుంది కమల.

బయట వర్షం... ఎంత తీవ్రంగా వుండాలో అంత జోరుగా కురుస్తోంది... పెద్దగాలి వీచి...వీధి తలుపులు ధడాలున తెరుచుకున్నాయి - హోరున జల్లుతో కూడినగాలి వచ్చి గదిలో ప్రవేశించింది, ఆనందరావు లేచి, వెళ్లి తలుపులు గడియపెట్టి వచ్చాడు.

కమల మూలుగుతూ వుంది - అటూ యిటూ కదులుతూ - ఆనందరావు కమల దగ్గరగా పోయి, దగ్గ్గవర్గి తల నిమురుతూ.

''జరిగిందేదో జరిగింది... అవన్నీ మరిచిపో... ఏవీ మనసులో పెట్టుగోక కొంచంసేపు నిద్రపో!'' అని అన్నాడు. కమల తన ధోరణిలో తను వుంది.

''అలాగని మిమ్మల్ని ప్రేమించలేదనుకోకండి.... మిమ్మల్ని దైవం కన్నా ఎక్కువగా

ప్రేమిస్తున్నాను.. నాకు మీకన్నా ఎక్కువ ఎవరూ లేరు. అట్లాంటి మీకు అన్యాయం చేశాను - అదే నన్ను పీడిస్తూంది... నేనింక బ్రతకను.. చూడండి, నా దొక్క కోర్కె - కాదంటే చెబుతాను . . .'' అని అడిగింది.

''చెప్పు కమల ! కాదనగలనా ?'' అని అన్నాడు.

''ఏదీ చెయ్యి యిలా ఇయ్యండి'' అంటూ అతని చేయి తన చేతిలోకి తీసుకుని -

''ఎవరయినా మంచి అమ్మాయిని వెదికి పెళ్ళి చేసుకోండి - అలాగయినప్పుడే నా ఆత్మకు శాంతి లభిస్తుంది'' అని ప్రార్థించింది.

''ఏవేం మాటలు కమల ? యింక చాలించు ! నీకేమీ భయంలేదు, నీకు నయమవుతుంది - జీవితంలో ఒక్కసారే భార్యాభర్తలవుతారని నీకు తెలియదా ?'' అని అన్నాడు.

''అయితే నన్ను క్షమిస్తారా ?... నేను బ్రతికితే క్షమించగలరా ? అప్పుడు... నాకు తెలుసు. కాని నేను మీకు తగ్గ భార్యను కాను... నాకా అర్హతలేదు !... కా-ద-న-కం-డి. నన్ను ... పో-నీం-డి !'' అంటూండగానే...

బయట పెద్ద చప్పుడయింది... అక్కడకు దగ్గరగానే ఎక్కడో పెద్ద శబ్దంతో పిడుగు పడింది.

ఆ శబ్దం విన్నదో లేదో... మరి కమల మాటాడలేదు ! అలానే - ఆనందరావు వయిపు చూస్తూ వుండిపోయింది. అతని చేతిలో ఆమె చేయి బిగుసుకుపోయింది. ఆమె అంతరాత్మ, అనంతవాయువుల్లో లీనమయిపోయింది.

''వెళ్ళిపోయావా కమల ?... నీ అనుభవం... ఒకగంగాతీరం, ఇక్కడ లేని మనశ్శాంతి నీకు ఏ లోకంలోనో దొరుకుతుందని అనుకున్నావా ? .... కమలా ? కాని - నువ్వు లేని నాకు మాత్రం మనశ్శాంతి వుంటుందని అనుకున్నావా !.... ఎవరేమనుకున్నా... నువ్వెవరికే విధంగా కనిపించినా... నాకు మాత్రం భార్యవే... కమల !'' అంటూ ఆమె మీద పడి విలపించసాగేడు, ఆనందరావు.

ఆ మాటలు విన్నదా అన్నట్టు కమల ముఖం ఏదో తృప్తి ప్రశాంతతా పొందినట్టు నిర్మలంగా వున్నది.

★ ★ ★

(దీనినే నాటక రూపంలో ప్రసారం చేసిన ఆకాశవాణి హైదరాబాదు వారికి కృతజ్ఞతలు)

(4.5.1960న ఆకాశవాణి, హైదరాబాదు నుండి ప్రసారమయినది)